RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 31 జూలై 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:54

# నాణ్యమైన విద్యను అందించే దీక్షబూనండి

**మండలం యూనిట్‌గా ప్రణాళికలు పంపండి..**

**ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా పని చేయాలి**

**మీ పర్యటన అనుభవాలు విద్యార్థులకు మేలు చేయాలి**

**విదేశీ విద్యకు ఏటా 10-15 మంది ఉపాధ్యాయుల ఎంపిక**

**సమాజ మార్పునకే విద్యా శాఖ బాధ్యతలు**

**ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైదరాబాద్ జులై 30 ; నాణ్యమైన విద్య రాష్ట్రానికి పునాది అయితే, నైపుణ్యాలు అంతస్తుల్లాంటివని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్ల ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్" కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసీహెచ్ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని, దానిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిలా చూడాలన్నారు. అంత మొత్తం ఖర్చు చేస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళుతున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామని తెలిపారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలని సూచించారు. వివిధ దేశాల పర్యటనతో ప్రపంచం ఎటు వెళుతుందో తెలుస్తుందని.. పర్యటనతో తెలుసుకున్న అంశాలను ఇక్కడ విద్యార్థులకు బోధించి వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమని తాము నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే తేల్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎకరాల కొద్ది భూమి, ఇతర ఆస్తులు ఉన్నా సమాజం ఎటు వెళుతుందో తెలియక వెనుకబడి పోతున్నారని, ఏ ఆస్తులు లేకపోయినా చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారని తెలిపారు.

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రూపకల్పన చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల మాదిరే ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తామని సీఎం తెలిపారు. అక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడ విద్యార్థులకు పంచాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల సమస్యలపై తనతో కొట్లాడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఉపాధ్యాయులు ఏ మండలానికి ఆ మండలం యూనిట్‌గా తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఆ మండలంలోని పాఠశాలల్లో ఏ వసతులు కావాలి, ఎంత మంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు ఏం అవసరమనే అంశాలు ఆ ప్రణాళికలో ఉండాలని సూచించారు. డిసెంబరు నెలాఖరుకు ఆ ప్రణాళిక తమకు అందజేస్తే దానికి అనుగుణంగా తాము కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ఆ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సీఎం సూచించారు.

వచ్చే అయిదేళ్ల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు

మిగతా 2 లో

## పేదల ఇళ్లే.. ప్రజా పాలన లక్ష్యం

## మంత్రి పొంగులేటి



వార్తా 2 లో

## అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మంత్రి సీతక్క



అంగన్వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు.

మిగతా 3 లో

# ఉప్పల్ అభివృద్ధికి భారీ ఊతం

**స్టార్మ్ వాటర్ డ్రైన్లు, సీసీ రోడ్లు, క్రీడా వసతులు,**

**శ్మశానవాటికల అభివృద్ధి పనులకు**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన**



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జూలై 30 (ప్రజాబలం):** ఉప్పల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రూ.76.46 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు--వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఆధునిక పట్టణ మౌలిక వసతుల కల్పన, వర్షపు నీటి పారుదల వ్యవస్థ బలోపేతం, రహదారుల మెరుగుదల, క్రీడా సౌకర్యాల విస్తరణ లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, కీసర ఆర్డీఓ, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లిరామంతాపూర్‌లో రూ.90 లక్షలతో భజరంగ్ వ్యాయామశాల విస్తరణలి

యువతకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించే లక్ష్యంతో భజరంగ్ వ్యాయామశాల గ్రౌండ్ ఫ్లోర్ విస్తరణ, బోర్‌వెల్ ఏర్పాటు, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు.

భాగాయత్--ఉప్పల్‌లో రూ.56.35 కోట్ల భారీ పనులులి

ఈ ప్యాకేజీలో ప్రధాన స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, మల్టీ స్పోర్ట్స్ అరేనా నిర్మాణం, పలు కాలనీల్లో సీసీ రోడ్లు, మరమ్మతులు, వి.టి. కమాన్ వద్ద బస్ స్టాప్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. దీంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గడంతో పాటు రవాణా, ప్రజా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

బొౖడాయి--చిలకనగర్--బీరప్పగడ్డలో రూ.3.23 కోట్లతో అభివృద్ధిలి

దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతులు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల పునర్నిర్మాణం, రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి, బీరప్పగడ్డలో రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

చెర్లపల్లిలో రూ.15.97 కోట్ల పనులులి

చెర్లపల్లి, వాంపుగూడ, కాప్రా ప్రాంతాల్లో కల్వర్టుల పునర్నిర్మాణం, విస్తరణ, టెర్షియరీ స్టార్మ్ వాటర్ డ్రైన్లు, ఆర్‌సీసీ పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, వర్షపు నీటి పారుదల వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన పనులు చేపట్టనున్నారు.

మంత్రి ఏమన్నారంటే...

ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పట్టణ మౌలిక వసతులు, ఆధునిక పౌర సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో చేపడుతున్న ఈ పనులు పూర్తయిన తర్వాత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, క్రీడా వసతులు, ప్రజా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో, పూర్తి పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

అధికారులు మాట్లాడుతూ, రూ.76.46 కోట్లతో చేపడుతున్న ఈ పనులు ఉప్పల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తాయని, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతాయని తెలిపారు.

## రాజ్యసభలో పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 30 దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026ను కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని ఏమాత్రం సహించబోమని, పేపర్ లీకేజీల పట్ల తమ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.ప్రశ్నాపత్రాల లీకేజీని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఈ బిల్లు ఒక నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడంలో ప్రధానమంత్రి ఏమాత్రం జాప్యం చేయలేదని కేంద్రమంత్రి వెల్లడించారు.

ఈ సవరణ బిల్లు నిబంధనల ప్రకారం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఒకవేళ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే, కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడంతో పాటు జరిమానాను రూ. 10 కోట్ల వరకు విధించేలా ప్రతిపాదించారు. దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేసి, ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల లోపు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ ముగించాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్ అనంతరం ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, తద్వారా ప్రధానమంత్రి మోదీ కుర్చీని కాపాడారని ఖర్గే వ్యాఖ్యానించారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

వార్తా 2 లో

ప్రజాబలం

31 జూలై 2026 శుక్రవారం

## ఉద్యోగులలో ఎఫర్ట్ రిసెషన్

ముఖ్యంగా యువ ఉద్యోగులు పనిపై తమ దృక్పథాన్ని మార్చుకుంటుండగా, కృత్రిమ మేధస్సు ఉద్యోగ ప్రపంచాన్ని వేగంగా ప్రభావితం చేస్తోంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా 2026 తాజా అధ్యయనం ప్రకారం భారతీయ సంస్థల్లో 'ఎఫర్ట్ రిసెషన్ అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. అంటే ఉద్యోగులు తమ విధుల్లో భాగం కాని అదనపు బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకోవడానికి ఆసక్తి చూపడం తగ్గుతోందని నివేదిక వెల్లడించింది.దేశవ్యాప్తంగా సర్వే చేసిన 380 సంస్థల్లో 240 సంస్థలు (63%), గత ఏడాదితో పోలిస్తే ఉద్యోగుల అదనపు కృషి తగ్గిందని తెలిపాయి. సగటున ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. నివేదిక ప్రకారం, ఉద్యోగులు ఎవరూ చెప్పకుండానే ఆలస్యంగా పనిచేయడం, తమ బాధ్యతలకు అతీతంగా సమస్యలను పరిష్కరించడం, స్వచ్ఛందంగా అదనపు బాధ్యతలు స్వీకరించడం వంటి అంశాలనే 'డిస్క్రెషనరీ ఎఫర్ట్'గా నిర్వచించారు. ప్రస్తుతం భారత ఉద్యోగుల్లో జెన్ జీవాటా 26 శాతానికి చేరుకుంది. ఇది 2023తో పోలిస్తే దాదాపు రెండింతలు. ఈ తరం ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయడం కంటే పని-వ్యక్తిగత జీవితం సమతుల్యత, అనువైన పని విధానం, నిరంతర నైపుణ్యాభివృద్ధి, కెరీర్ పురోగతి, అర్థవంతమైన పని, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధ్యయనం పేర్కొంది. అదే సమయంలో ఏఐ ప్రభావంతో ఉత్పాదకతను కొలిచే విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. అయితే తాజా నివేదిక ప్రకారం ఉద్యోగుల అదనపు కృషి తగ్గుదల అన్ని రంగాల్లో ఒకేలా ఉండటం లేదు.రిటైల్ రంగంలో 88%, ఐటీ మరియు ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో 77%, నిర్మాణం, రియల్ ఎస్టేట్‌లో 71%తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్)లో కేవలం 44% తగ్గుదల నమోదైందని తెలిపాయి.ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది.ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది.దట్ కల్చర్ థింగ్ సంస్థకు చెందిన ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్ గుర్లీన్ బరువా అభిప్రాయం ప్రకారం ఇది పని పట్ల నిబద్ధత తగ్గిపోవడం కాదని, పనిని చూసే విధానం మారుతున్న సంకేతమని పేర్కొన్నారు. పని పట్ల నిబద్ధత అంటే కేవలం ఎక్కువ గంటలు పనిచేయడం లేదా ఎప్పుడూ బిజీగా కనిపించడం మాత్రమే కాదు. సమస్యలను సమర్థంగా పరిష్కరించడం, నాణ్యమైన ఫలితాలు ఇవ్వడం, బృందంతో సమన్వయంగా పనిచేయడం కూడా నిజమైన వర్క్ ఎథిక్‌లో భాగమే అని ఆమె చెప్పారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏఐ కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో గంటల కొద్దీ పనిచేయడం కంటే సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతికతను సమర్థంగా వినియోగించడం కీలకంగా మారుతోంది. అలాగే వర్క్ ఫ్రం హోమ్, హైబ్రిడ్ వర్క్, మానసిక ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన కారణంగా ఉద్యోగులు తమ వ్యక్తిగత సమయానికి ఎక్కువ విలువ ఇస్తున్నారు. నేటి ఉద్యోగులు అదనపు కృషి చేయడానికి సిద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కృషికి స్పష్టమైన ఉద్దేశం, గుర్తింపు, విశ్వాసం, అర్థవంతమైన పని ఉంటేనే ముందుకు వస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## పేదల ఇళ్లే.. ప్రజా పాలన లక్ష్యం మంత్రి పొంగులేటి

**- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. రాష్ట్రంలో గుడిసెలే ఉండకూడదనేదే మా సంకల్పం**

**- రూ.1.25 కోట్లతో చంద్రుగొండ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- మహిళల సాధికారతకు రూ.70 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి**



**చంద్రుగొండ జూలై 30 ప్రజబలం ప్రతినిధి :** ప్రజల ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేరవేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంగయ్యబంజార, పొకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు.

– ?పూరి గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దుతాం

?పొకలగూడెం వేదికగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకూడదనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతల్లో మొత్తం 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని చేపట్టామని, ఒక్క రాజధాని హైదరాబాద్‌లోనే ప్రత్యేకంగా లక్ష ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం నెత్తిపై పెట్టినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

?ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ఏకంగా 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇటీవలే మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించామన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించామన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అర్హులకు కొత్త రేషన్ కార్డులతో పాటు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తూ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వివరించారు.

– ?అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

?మండలంలోని మంగయ్యబంజార గ్రామంలో రూ.45 లక్షలతో చేపట్టే గ్రావెల్ రోడ్డు, కల్వర్టు, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి కొత్తగా 24 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పొకలగూడెంలో రూ.60 లక్షల వ్యయంతో నాలుగు అంతర్గత సీసీ రోడ్ల పనులను ప్రారంభించి, ఈ గ్రామానికి ఇప్పటికే 77 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. రావికంపాడులో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మిగిలిన అంతర్గత రహదారులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

?ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, డీపీఓ అనూష, గృహనిర్మాణ శాఖ పీడీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

**ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి**

**రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**





రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (State Export Promotion Committee--SEPC) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు.

ఎగుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు.

ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

**వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ**

**అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు**

**ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న బిల్లు**

జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. నిన్న ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది.

1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# నాణ్యమైన విద్యను అందించే దీక్షబూనండి






మొదటి పేజీ తరువాయి

దీక్షబూనాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దాలని, సమాజం కోసం, తరతరాల భవిష్యత్ ను మార్చేందుకు అయిదేళ్ల పాటు పాటుపడేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని కోరారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులకు మొదటి తేదీనే వేతనాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందజేస్తున్నామని తెలిపారు. విద్యపై ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మానవ సంబంధాలను మెరుగుపర్చే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలు మనలోని మానసిక ఒత్తిడిని దూరం చేస్తారని అన్నారు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు ఉన్న సమాజం, దేశమే అభివృద్ధి చెందుతుందని, మానవ సంబంధాలు లేని దేశాలు అభివృద్ధి పథంలో పయనించవని సీఎం పేర్కొన్నారు. విద్యార్థులు రోజులో అధిక సమయం పాఠశాలల్లోనే ఉంటారని, వారికి మానవ సంబంధాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని సీఎం అన్నారు.

విద్య నైపుణ్యం కాదని, విద్యతోపాటు నైపుణ్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ ఒక భాష మాత్రమేనని, భాష సమాచార మార్పిడికి ఉపయోగపడుతుందని, నైపుణ్యం జీవనోపాధి కల్పిస్తుందన్నారు. చైనా, జపాన్, కొరియా, జర్మనీ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడే వారు 10 శాతం మించి ఉండరని, కానీ వారికున్న నైపుణ్యంతో ప్రపంచాన్ని శాసిస్తున్నారని తెలిపారు. జపాన్, జర్మనీ, కొరియా భాషలు కొంత నేర్చుకొని నైపుణ్యాలు నేర్చుకుంటే అక్కడ మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నిరక్షరాస్యత, కరవుకాటకాలతో దేశం సతమతమవుతున్నప్పుడు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విద్యా, నీటిపారుదల రంగాలను తన ప్రాధాన్యాంశాలుగా ఎంచుకొని ఆ సమస్యలను అధిగమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలు, సాగు నీటి ప్రాజెక్టులు నెహ్రూ దార్శనికతకు నిదర్శనమన్నారు. నాడు వేసిన పునాదులతో నేడు ప్రతి తండా, గూడెంలోనూ పాఠశాలలు ఏర్పాటయ్యాయని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. సాంకేతిక విప్లవంతో వైట్ కాలర్ జాబ్‌లను మనం అందిపుచ్చుకున్నామని, కానీ ఇప్పుడు ఆ జాబ్‌లకు కాలం చెల్లిందన్నారు. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో నైపుణ్యాలకు డిమాండ్ ఉన్నందున, అక్కడి అవసరాలకు తగినట్లు నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందులో భాగంగానే సంప్రదాయ కోర్సులతో ప్రభావం కోల్పోయిన ఐటీఐలను టాటా సంస్థ సహకారంతో ఏటీసీలుగా ఆధునీకరించామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉట్నూరు ఏటీసీలో శిక్షణ పొందిన వారంతా టాటా సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఎం తెలిపారు.

కరవు, కాటకాలు, నిరక్షరాస్యతలో కూరుకుపోయిన దేశాన్ని సాగు నీటి ప్రాజెక్టులు, విద్యాలయాల ఏర్పాటుతో సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నెహ్రూపైనా విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. పాకిస్థాన్‌లను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, గరిబీ హటావో నినాదంతో పని చేసిన ప్రధానమంత్రి ఇందిరా గాంధీపైనా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరి నుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ.51 లక్షల కోట్ల అప్పులు చేస్తే, 2014 నుంచి 2026 వరకు 12 ఏళ్లలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. గోరంత పనులను కొండంత చెప్పుకుంటున్నారని, ఎన్నో యుద్ధాలు, కలి, నిరక్షరాస్యతలను అధిగమించిన విజయాలను ఎలా ప్రచారం చేయాలని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సర్వేలు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని, తర్వాత కాలంలో అదే నవోదయ విద్యాలయాలకు, గురుకుల పాఠశాలలకు నమూనాగా నిలిచిందన్నారు. ఆ పాఠశాలలో చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. సాగు నీటి ప్రాజెక్టులను నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా వర్ణించారని, నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణలో ఈనాడు 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. 80 వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూళేశ్వరం అయిందని విమర్శించారు.

ప్రతి పేద విద్యార్థికి విద్యను అందించడంతో సరిపెట్టుకోకుండా వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనేది తన ఆశయమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి వంటి మారుమూల పల్లె ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను తెలంగాణలోని 12 వేల పల్లెల్లోని పాఠశాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నానని సీఎం అన్నారు. కొందరు విద్యా శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని విమర్శిస్తున్నారని, నర్సరీ నుంచి 12 వతరగతి వరకు బ్రేక్ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా? ఐటీఐలను ఏటీసీలుగా మార్చినందుకా? స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్ గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో వాళ్లు తెలపాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం, రాజకీయం కోసం తాను పని చేయడం లేదని సీఎం అన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలనేదే తన లక్ష్యమన్నారు. సమాజ మార్పునకే తాను విద్యా శాఖ బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి వీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్ఆర్డీ డైరెక్టర్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, చిన్నారుల పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, దత్తత కేంద్రాలు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందన్న వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు.

చిన్నారుల ఉదయం ఆకలిని తీర్చడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడేలా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యమైన ఆహారం అందడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలను స్వీకరించి వాటి ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 16 జిల్లాల్లో నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

గత ఏడాది కాలంలోనే 5,938 కేంద్రాలకు టాయిలెట్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం

రాష్టంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వంద శాతం మౌలిక వసతులు కల్పించాలి

ఏ మాత్రం జాప్యం లేకుండా అన్ని జిల్లాల్లో అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి

అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలి

అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

టీచర్లు, ఆయాల యూనిఫాంలను అక్టోబర్ తొలి వారంలోగా సిద్ధం చేయాలని, అంగన్వాడీ టీచర్లకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. కేంద్రాలకు ముదురు రంగులు కాకుండా పిల్లలకు ఉత్సాహాన్ని కలిగించే ఆహ్లాదకరమైన రంగులు వేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్యం, పోషణకు అనువైన వాతావరణంగా మారాలని చెప్పారు.

వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా అంగన్వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా మార్చాల్సిన పరిస్థితి వస్తే, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన అన్ని జిల్లాలు, ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసి బాలింతలకు సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు.

ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు. పిల్లల సంరక్షణ, దత్తత ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.

తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల నివారణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

నిధులు లాప్స్ కాకుండా పూర్తిగా వినియోగించాలి

కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయి సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా ఇద్దరు, ముగ్గురు అధికారులను నియమించి సమన్వయ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారుల మధ్య సమన్వయం కోసం కూడా ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, రోజువారీ, వారపు నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని మంత్రి సూచించారు. ఎన్ని కేంద్రాలు, హాస్టళ్లను సందర్శించారు, అక్కడ గుర్తించిన సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటన్న వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

## ఝార్ఖండ్ బొగ్గు మాఫియాపై ఈడీ ఉక్కుపాదం

ధన్ బాద్ అక్రమ బొగ్గు తవ్వకాలు, మనీలాండరింగ్ ఆరోపణలపై ధన్బాద్ జిల్లాలోని 25 చోట్ల ఈడీ ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆస్తుల పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా సుమారు రూ.600 కోట్ల విలువైన ఆస్తులు, పెట్టుబడులను గుర్తించిన ఈడీ.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. దర్యాప్తులో అక్రమ బొగ్గు తవ్వకాల ద్వారా వచ్చిన నిధుల జాడను గుర్తించి, వాటి నెట్వర్క్ను ఛేదించడంపై ఈడీ దృష్టి సారించింది

## మృతుడు డిజిల్ దొంగ

అనంతపురం గుత్తి – తాడిపత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని తెలంగాణ వాసిగా పోలీసులు గుర్తించారు. డీజిల్ దొంగల ముఠా కు చెందిన కారు వేగంగా లారీని ఢీ కొనడం తో ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగాయి. వెంటనే ఇద్దరు కారు నుంచి బయటకు దూకేసినట్లు పోలీసులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న డీజిల్ దొంగ సజీవదహనం అయ్యాడు. వీరంతా తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా మరికల్ మండలం బుడేగాన్ తాండాకు చెందిన వారిగా గుర్తింపచారు.

### నిండు కుండలా కళకళలాడుతున్న కడెం ప్రాజెక్టు

నిర్మల్ కడెం ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 21,048 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం(ఈఖీఒ)700అడుగులు ప్రస్తుతంనీటిమట్టం 691 అడుగులకు చేరుకుంది. ఇదే స్థాయిలో వరద ప్రవాహం కొనసాగితే లేదా మరింత పెరిగితే, ప్రాజెక్టు స్పిల్వే గేట్లను ఎత్తినీటినిదిగువకు విడుదలచేసేఅవకాశం వుంది.

### గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

మహబూబాబాద్ పట్టణం లోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం అయ్యారు. దాంతో కళాశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అందోళనలో వున్నారు.

# కల్లూరులో ప్రజా దర్బార్ -- వేలాది మంది సమస్యలు స్వీకరించిన మంత్రి పొంగులేటి...



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 30:** సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు డీఎస్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించిన ప్రజా దర్బార్‌తో పాటు రైతు సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అదనపు కలెక్టర్, డీఎఫ్ఓతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




కల్లూరు, తల్లాడ మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో నేరుగా మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయికి అందజేశారు. అందిన వినతులను పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ మార్గదర్శకాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ “రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం” అని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతులు, ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను వివరిస్తూ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొంటూ, సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# వరుదు కల్యాణికి మొండి చేయేనా

విజయవాడ, జూలై 30, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ కావడం, దాని చుట్టూ ఇప్పుడు వైసీపీ అంతర్గత రాజకీయాల్లో నడుస్తున్న డ్రామాలు చూస్తుంటే సామాన్య కార్యకర్తలకు ఇదేం మాస్టర్ ప్లాన్ సామీ అని తలపట్టుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. మండలి వైస్ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ పదవీకాలం ముగిసిపోయింది. ప్రస్తుతం మండలిలో వైసీపీకి ఇంకా సంఖ్యాబలం ఉంది కాబట్టి, ఆ ఉపసభాపతి పీఠం ఆ పార్టీకే దక్కనుంది. సరిగ్గా ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి మార్క్ అన్ ప్రిడిక్టబుల్ వ్యూహం మళ్లీ రచ్చకెక్కింది.సాధారణ పొలిటికల్ లాజిక్ ప్రకారం ఆలోచిస్తే.. ప్రస్తుతం పార్టీ ఘోర పరాజయం తర్వాత కోలుకోవడానికి కూటమికి బదులిచ్చే సామాజిక సమీకరణాలు వాడాలి. పోయిన స్థానం ముస్లిం మైనారిటీది కాబట్టి మళ్లీ అదే వర్గానికి ఇస్తే ఆ సామాజిక వర్గానికి మంచి సంకేతం వెళ్తుంది. లేదా, కూటమిని డిఫెండ్ చేయడానికి కాపులకో, లేదంటే గట్టిగా వాయిస్ వినిపించే బిసి వర్గానికి చెందిన వరుదు కల్యాణి లాంటి నాయకురాలికో ఆ అవకాశం ఇవ్వాలి. పొద్దున లేస్తే మైకుల ముందు నిలబడి, కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ పార్టీ జెండా మోస్తున్న వరుదు కల్యాణి లాంటి వారికి ఇస్తే క్యాడర్‌లో కూడా ఒక రకమైన జోష్ వస్తుంది. లేదంటే తమ పక్కా ఓటు బ్యాంక్ అయిన దళితులకో, రెడ్డి సామాజిక వర్గానికో ఇచ్చి సంతృప్తి పరచవచ్చు.కానీ, వైఎస్ జగన్ ఆలోచనలు వేరే స్థాయిలో ఉంటాయి కదా! రాజకీయంలో లాజిక్కులు వెతికేవారికి ఆయన ఎప్పుడూ షాక్‌లే ఇస్తారు. ఏ రాజకీయ లెక్కలకూ అందకుండా, ఈ కీలక పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాధవరావుకు అప్పగించాలని డిసైడ్ అయ్యారట. టీవీ డిబేట్లలోనో, బయటో పార్టీ కోసం గట్టిగా మాట్లాడలేని, రేపు పొద్దున పార్టీలో ఉంటారో లేదో కూడా గ్యారంటీ లేని నేతకు ఈ చాన్స్ ఇవ్వడం చూసి వైసీపీ సొంత నేతలే జుట్టు పీక్కుంటున్నారు. మాట్లాడేవారికి పదవులు ఉండవు.. పదవులు వచ్చేవారు మాట్లాడరు అనే కొత్త సూత్రాన్ని జగన్ ఇక్కడ అమలు చేస్తున్నారని పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.మైకుల ముందు నిలబడి గొంతు చించుకునే వరుదు కల్యాణి లాంటి నేతలకు కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం చేసి, ఏమాత్రం సౌండ్ చేయని నేతలకు పీఠాలు అప్పగించే ఈ జగన్ మార్క్ సర్‌ప్రైజ్ రాజకీయం చూసి ప్రత్యర్థులు నవ్వుకుంటుంటే, సొంత కార్యకర్తలు మాత్రం ఏందో ఈ ఆపరేషన్.. మనకెందుకీ సిట్యుయేషన్ అని నిట్టూరుస్తున్నారు. ప్రజాక్షేత్రంలో ఎలాగూ షాక్‌లు తింటున్నాం, కనీసం పదవుల పంపిణీలోనైనా కాస్త బుర్ర ఉపయోగిస్తే బాగుండు అని వైసీపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నా.. జగన్ రూటే వేరు అని మరోసారి నిరూపితమైంది. ఈ మొత్తం వ్యవహారంలో వరుదు కల్యాణికి ఎందుకు ఇవ్వడం లేదంటే.. ఆమె ఇప్పటికే బాగా మాట్లాడుతూ పేరు తెచ్చుకున్నారు.ఈ పదవి ఇస్తే ఇంకా ఫోకస్ అవుతారు. జగన్మోహన్ రెడ్డికి అది ఇష్టం ఉండదు. ఈ విషయం వైసీపీలో ఉన్న అందిరకీ తెలుసు.

# కీ రోల్ లో తమ్మినేని వాణి

శ్రీకాకుళం జూలై 30, మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుటుంబం చుట్టూ ప్రస్తుతం చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపి, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, ఫోర్జరీ వారసత్వ పత్రాలు సృష్టించి రూ.4 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నిన కేసులో తమ్మినేని కుటుంబం ఇరుక్కుపోయింది. ఈ కేసులో హైకోర్టు నుంచి తమ్మినేని సీతారాం, ఆయన భార్య తమ్మినేని వాణిలకు తాత్కాలిక ముందస్తు బెయిల్ లభించినప్పటికీ, కుమారుడు చిరంజీవి నాగ్‌కు మాత్రం బెయిల్ నిరాకరించడంతో సీతారాం తీవ్ర ఇరకాటంలో పడ్డారు. దీనికి తోడు, అమదాలవలస పరిధిలోని ఖాకీ కాలేజీ వెనుక ఉన్న దళిత కుటుంబం భూమిని ఆక్రమించారంటూ వాణిపై తాజాగా మరొక ఫిర్యాదు పోలీసులకు అందిందిఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో తమ్మినేని సీతారాం కేవలం పేరుకే ప్రజాప్రతినిధిగా, స్పీకర్‌గా ఉండేవారని, అసలు డాన్ పాత్ర పోషించింది మాత్రం ఆయన భార్య తమ్మినేని వాణినే అనే టాక్ బలంగా ఉంది. సీతారాం సంపాదించిన రాజకీయ పదవులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వెనుకుండి సెటిల్మెంట్లు, భూ లావాదేవీలు, రాకెట్లు నడిపించడంలో ఆమె ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. కొడుకు చిరంజీవి నాగ్ కూడా పూర్తిగా తల్లి ఆదేశాల మేరకే పనిచేస్తూ ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణల్లో పాత్రదారులుగా మారారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆముదాలవలసలో జరిగిన పలు అక్రమాలు, దందాలు, భూ ఆక్రమణల వెనుక వాణి ముద్రలు ఉన్నాయనే అంశం ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తన గుప్పిట్లో ఉంచుకుని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే స్థాయికి ఈ దందాలు సాగాయని స్థానిక బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లను సాక్షులుగా పెట్టి, నకిలీ వారసులను సృష్టించి కోట్లాది రూపాయల ఆస్తులను తమ ఖాతాలో వేసుకున్నారనే నిజాలు దర్యాప్తులో వెలుగుచూడటం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. సీతారాం స్పీకర్ హోదాలో ఉండటంతో బాధితులు ఎవరూ బయటకు వచ్చి మాట్లాడటానికి ధైర్యం చేయలేకపోయేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడం, పోలీసు దర్యాప్తు పారదర్శకంగా సాగుతుండటంతో వాణి సృష్టించిన అక్రమాల చిట్టా అంతా బయటపడుతోంది. ప్రజాప్రతినిధిగా ఉన్న భర్త పవర్‌ను దుర్వినియోగం చేస్తూ ఆముదాలవలసను ఏలిన ఈ షాడో లీడర్ నిజస్వరూపం బయటపడటంతో, తమ్మినేని కుటుంబానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది.

# మారని ఆ 15 మంది.. మూసధోరణిలోనే తమ్ముళ్లు

విజయవాడ, జూలై 30, తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి రాజకీయ వ్యూహాలు ఎల్లప్పుడూ అత్యంత పదునుగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఎమ్మెల్యేల పనితీరు, అవినీతి ఆరోపణలు, నియోజకవర్గాల్లో అసమ్మతి గ్రూపులు వంటి వ్యవహారాల్లో పడి ప్రజలకు దూరమవుతున్న దాదాపు 40 మంది ఎమ్మెల్యేలకు ఆయన గట్టి హెచ్చరికలే జారీ చేశారు. బాబు హెచ్చరికలతో ఆ 40 మందిలో దాదాపు 25 మందికి పైగా వెంటనే అలర్ట్ అయి, తమ తీరు మార్చుకుని దారికి వచ్చారు. అయితే, మిగిలిన ఆ 15 మంది మాత్రం ఇంకా పాత ధోరణినే కొనసాగిస్తూ నాయకత్వానికి మింగుడుపడని సవాలుగా మారారు.కానీ, ఈ ‘బ్లాక్ లిస్ట్’లో ఉన్న మిగిలిన 15 మంది ఎమ్మెల్యేల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న నూతన వ్యూహం ఇప్పుడు ఏపీ రాజకీయంలో ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని నేరుగా సస్పెండ్ చేస్తే.. సామాజిక వర్గాల కార్డులు లేదా సానుభూతి రాజకీయాలు తెరపైకి వస్తాయి. పైగా నియోజకవర్గాల్లో అనవసరంగా రచ్చ జరుగుతుంది. సరిగ్గా ఈ సమయంలో కాగల కార్యాన్ని గాంధర్వులే తీర్చినట్లు .. టీడీపీ వదిలించుకోవాలని భావిస్తున్న ఆ అసంతృప్త నేతలను ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ మెల్లగా తమవైపు ఆకర్షించేలా పరిణామాలు జరిగిపోతున్నాయి.ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ సస్పెన్స్ దాగి ఉంది. అసలు ఆ ఎమ్మెల్యేలను వైసీపీనే ఆకర్షిస్తోందా? లేక అధిష్ఠానమే తెలివిగా, వ్యూహాత్మకంగా వారిని ఆ వైపునకు తోలేస్తోందా? అనేది సాధారణ రాజకీయ పరిశీలకులకు కూడా అర్థం కానంత నిశ్శబ్దంగా జరుగుతోంది. నియోజకవర్గాల్లో వారికి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గించడం, వినతులు పట్టించుకోకపోవడం ద్వారా.. మీకు ఇక్కడ భవిష్యత్తు లేదు అనే స్పష్టమైన సంకేతాన్ని పార్టీ పంపుతోంది. దీంతో దిక్కుతోచని ఆ నేతలు సహజంగానే తమ రాజకీయ ఉనికి కోసం వైసీపీ లేదా ఇతర మార్గాల వైపు చూసే పరిస్థితి ఏర్పడుతోంది.ఒకవేళ ఈ ఎమ్మెల్యేలు స్వయంగా టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకుంటే, అది చంద్రబాబుకు రెండు రకాలుగా లాభిస్తుంది. మొదటిది.. నియోజకవర్గాల్లో పనిచేయని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతల భారం పార్టీపై నుంచి దానంతటదే తొలగిపోతుంది. రెండోది.. రాబోయే ఎన్నికల్లో కొత్త రక్తానికి, కష్టపడే క్యాడర్‌కు టికెట్లు కేటాయించడానికి అధిష్ఠానానికి సంపూర్ణ క్లియరెన్స్ దక్కుతుంది. అనవసర వివాదాలకు తావివ్వకుండా, నేరుగా పోటు పొడవకుండా.. వదిలించుకోవాలనుకున్న వారిని స్వయంగా బయటకు వెళ్లేలా పరిస్థితులు కల్పించడమే చంద్రబాబు మార్క్ రివర్స్ సైకాలజీ అని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడుకుంటూనే, వ్యర్థాలను బయటకు నెట్టేసే ఈ నిశ్శబ్ద వ్యూహం చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు.


# పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీ

విజయవాడ, జూలై 30, రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా అందిస్తున్న బియ్యాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించకపోవడానికి గల కారణాలపై పౌర సరఫరాల శాఖ సమగ్ర అధ్యయనం నిర్వహించింది.

ప్రతి కిలోపై రూ.56 వరకు రాయితీ ఇస్తున్నప్పటికీ వినియోగం తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం ప్రస్తుతం పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతేనని గుర్తించినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే స్టీమ్ రైస్ అందిస్తే వినియోగం పెరగడంతో పాటు బియ్యం పక్కదారి పట్టకుండా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని 42 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద స్టీమ్ రైస్‌ను విజయవంతంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ విధానాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ అమలు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ప్రతిపాదించగా సానుకూల స్పందన లభించిందన్నారు.దేశంలోనే తొలిసారిగా కాకినాడ జిల్లాలో పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీకి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో రేషన్ కార్డుదారులు, పాఠశాలలు, హాస్టళ్ల అవసరాల కోసం నెలకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుందని అంచనా వేశారు. పైలట్ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్రం అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ధాన్యం సేకరణకు అంగీకరించిందని, రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని చెప్పారు. ఈ త్రైమాసికంలో రాష్ట్రవ్యాప్తంగా 1,000 ‘మీ మార్ట్’లను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్‌సీసీఎఫ్‌తో ఒప్పందం కుదిరిందని, ఈ మార్టుల్లో సుమారు 70 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు లభిస్తాయని చెప్పారు. ఆగస్టు 1 నుంచి 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక అవుట్‌లెట్లలో బీపీటీ స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, గ్రేడ్-1 రా రైస్‌ను రూ.50కు విక్రయించనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో స్వర్ణ రకం బియ్యాన్ని కూడా రైతు బజార్ల ద్వారా రూ.40కే అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ప్రతి రేషన్ కార్డుదారుడికి 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు.బియ్యం ప్యాకింగ్ నుంచి వినియోగదారుడి వరకు పూర్తి ట్రాకింగ్ కోసం క్యూఆర్ కోడ్‌కు బదులుగా ఆర్‌ఎఫ్‌ఐడీ విధానాన్ని కాకినాడ జిల్లాలో పైలట్‌గా అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

అలాగే సీబీడీసీ ఆధారిత డిజిటల్ వాలెట్ విధానాన్ని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ విధానం వల్ల ప్రజలకు రాయితీ నేరుగా అందడంతో పాటు రేషన్ డీలర్ల కమిషన్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి స్పష్టం చేశారు. .

# ఎర్రమిర్చికి ఊహించని ధర



గుంటూరు, జూలై 30, మిర్చి పంటను సాగు చేయడం కత్తి మీద సామే. ఏ మాత్రం తేడా వచ్చినా పంటంతా తెగుళ్లే. ఒకవేళ తెగుళ్ల నుంచి కాపాడుకున్నా నాణ్యమైన దిగుబడి రాదు. సరే ఆ వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండదు. దళారులు ఎంత చెప్తే అంతకి ఇచ్చి వెళ్తుంటారు. కానీ ఇక్కడో రైతు బయ్యర్లకే దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. నెంబర్ వన్ నాటు రకాన్ని సాగు చేసి ఎర్రబంగారంలా మెరిసే మిర్చిని సాగు చేశాడు. రూ. 32 వేలు పలికినా ఇవ్వకుండా రూ. 40 వేల గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాడు.రైతు వేసిన పంట ఊహించిన దాని కంటే ఎక్కువ ధర పలికిందంటే ఆ రైతు పంట పండినట్టే. ఇక్కడ కూడా ఓ రైతు ఎర్రబంగారం సాగు చేశాడు. గుంటూరు మిర్చి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. మిర్చే కాదు ధర కూడా ఘాటెక్కింది. టాప్ క్వాలిటీ రావడంతో దళారులు ఆ పంట కోసం ఎగబడుతున్నారు. క్వింటాకు రూ. 32 వేలు ఇస్తామని ముందుకొస్తున్నా.. ఇంకాస్త ఎక్కువ ధర పలుకుతుందన్న ధీమాతో ఆ రైతు విక్రయించడం లేదు.గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు చిట్టినేని అమర్‌నాథ్ నాటు రకం సూపర్ 10 డీలక్స్ మిర్చిని నాలుగు ఎకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో తొలి కాపు రాగా.. ధర పెద్దగా లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజ్‌లో పంటను నిల్వ చేశాడు.ఇటీవల కొద్ది కాలంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో ధరలు రైతులకు అనుకూలంగా ఉండటంతో తన పంటను విక్రయించేందుకు అమర్‌నాథ్ మూడు లాట్ల శాంపిల్స్‌ను తీసుకొచ్చాడు. యార్డులోని శ్రీ కృష్ణవేణి చిల్లీస్ దిగుమతి షాపు వద్దకు తీసుకురావడంతో ఎర్రగా నిగనిగలాడుతున్న ఆ టాప్ క్వాలిటీ మిరపకాయలను చూసి ఎగుమతిదారులు ఆశ్చర్యపోయారు. దాంతో ఆ మిర్చిన కొనేందుకు చాలా మంది ఆసక్తిచూపారు.మిర్చి క్వింటా ధర రూ. 25 వేల వరకే ఉండేది.. అలాంటిది క్వాలిటీ మిర్చికి తోడు పోటీ కూడా పెరగడంతో రికార్డు స్థాయిలో రూ. 32 వేల వరకు వేలం వెళ్లింది. అయితే, రూ. 40 వేలకు అమ్మాలన్న ఉద్దేశంలో రైతు అమర్‌నాథ్ ఉన్నాడు. దాంతో వంద టిక్కీల మిర్చి యార్డులోనే ఉంది. తాను అనుకున్న ధర వచ్చిన తర్వాతే విక్రయించాలని రైతు ఉన్నాడు. పంటకు తెగులు సోకినా తగిన సంరక్షణ చర్యలు తీసుకుని క్వాలిటీ ఏ మాత్రం దెబ్బతినకుండా సాగు చేశాడని.. అందుకే ఈ స్థాయిలో మిర్చి రికార్డు ధర పలికింది అంటూ గుంటూరు ఏఎంసీ వర్గాలు అంటున్నాయి.

# 17 నుంచి భోగాపురం కమర్షియల్ సేవలు

విజయనగరం, జూలై 30, భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవాన్ని ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, కూటమి నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక రంగాలకు కీలకంగా మారనుందని అధికారులు చెబుతున్నారు. ప్రారంభోత్సవంలో గిరిజన కళాకారుల ప్రత్యేక ప్రదర్శన ద్వారా గిన్నిస్ రికార్డు సాధించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.ఇదిలా ఉండగా, శ్రీకాకుళం జిల్లాలోని ప్రజలు కూడా భోగాపురం విమానాశ్రయం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు సజావుగా సాగాలని కోరుతూ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సౌర హోమం, అష్ట దిగ్పాలకుల ఆవాహన, నవగ్రహ ఆవాహన వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు.కేంద్ర పౌరవిమానయాన శాఖ తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్టు 17 నుంచి విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలు నిలిపివేయనున్నారు. ఈ నిర్ణయం 30 ఏళ్ల కాలానికి వర్తిస్తుందని పేర్కొంది. అయితే జాతీయ అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపు ఉంటుందని తెలిపింది. విశాఖ విమానాశ్రయం నుంచి భారత వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విభాగాలకు చెందిన విమానాలు, ప్రభుత్వ అతిథుల విమానాలు, వీఐపీ, లీజ్ విమానాలు కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలకు కూడా అనుమతి ఉంటుందని వెల్లడించింది.ప్రస్తుతం విశాఖపట్నం విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్ కోడ్ 'ఖజీ'ను ఆగస్టు 17 నుంచి భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేయనున్నారు. అలాగే భోగాపురం విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా అధికారిక గుర్తింపు లభించింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం విడుదల చేసింది.జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తాజాగా కేంద్రం ఆ నిర్ణయాన్ని అధికారికంగా ఆమోదించింది. దీంతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుంది.

# తెలుగు రాష్ట్రాల మధ్య బోట్ల పంచాయితీ

కర్నూలు, జూలై 30, నంద్యాల జిల్లా నిందికొట్కూరు పరిధిలోని కొత్తపల్లి మండలంలో కృష్ణా నది మధ్యలో ఉన్న సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, ఈ సమయంలో ఏపీ, తెలంగాణ ప్రాంతాల మధ్య బోట్ల పంచాయితీతో ఇరు రాష్ట్రాల బోటు యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన బోట్లకు సరైన పత్రాలు లేవంటూ ఏపీ పోలీసులు వాళ్లకు అనుమతి నిరాకరిస్తే.. కృష్ణాలో నీళ్లు పెరిగాయని తెలంగాణ పోలీసులు ఏపీ వారిని అడ్డుకుంటున్నారు.వర్షాలు లేని సమయంలో నంద్యాల జిల్లాలోని సంగమేశ్వర ఆలయాన్ని దర్శించే అవకాశం దక్కుతుంది. కృష్ణా నది మధ్యలో ఉండే ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు ఎంతోమంది పర్యాటకులు ఇక్కడికి బోట్లలో వస్తుంటారు. అయితే ఈ ప్రాంతం ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఇరు రాష్ట్రాల బోటు యజమానులు అక్కడ పర్యాటకులను చేరవేస్తుంటారు. ఇప్పుడు ఇరు రాష్ట్రాల పోలీసులు ఒకరిపై మరొకరు ఆంక్షలు విధించడం చర్చనీయాంశంగా మారింది.నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరం క్షేత్రం వద్ద కృష్ణానదిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సంగమేశ్వరం, సోమశిల మధ్య నిత్యం బోట్లు తిరుగుతుంటాయి. యాత్రికులను ఆ ప్రాంతాలకు చేరవేసినందుకు బోటు యజమానులు కొంత డబ్బు తీసుకుంటారు. అయితే, తెలంగాణ బోట్లకు సరైన పత్రాలు లేవంటూ ఏపీ పోలీసులు అనుమతించకపోవడంతో ఇప్పుడు పెద్ద సమస్య ఏర్పడింది.ఏపీ సరిహద్దు జలాల్లోకి తెలంగాణ బోట్లను అనుమతించకపోవడంతో తెలంగాణకు చెందిన బోట్ల యజమానులు కూడా ఏపీ బోట్లను తమ సరిహద్దుల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారు. దాంతో మూడు రోజులుగా ఇరు రాష్ట్ర మధ్య బోట్ల పంచాయితీ నడుస్తోంది. పైన కురుస్తున్న వర్షాలకు కృష్ణా నదిలో నీరు పెరుగుతుందని అసలు బోట్లు తిప్పేందుకు అనుమతి లేదంటూ తెలంగాణ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.యాత్రికులు, పర్యాటకులు ఎక్కువగా వచ్చే ఈ సమయంలోనే బోట్ల యజమానులు నాలుగు రూపాయలు వస్తాయి. అలాంటిది ఈ సమయంలో ఇలాంటి బోట్లను నిలిపివేస్తే తామేం చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ఏపీ, ఇటు తెలంగాణ ఇరు రాష్ట్రాల బోటు యజమానులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొత్తపల్లి మండలపరిధిలోని సంగమేశ్వరుని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది ప్రజలు వస్తున్నారు. నీళ్లలో నుంచి ఆలయం బయట పడటం.. ప్రత్యేక పూజలు జరుగుతుండటంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇలాంటి సమయంలో బోట్లను ఆపేయడం సరికాదని ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# అభిజిత్ పెళ్లి చేసుకుంటమంటూ మహిళలు క్యూ

న్యూఢిల్లీ, జూలై 30, నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంతోకాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేరు దేశం మొత్తం మార్మోగిపోతోంది. దీంతో అతడితో పెళ్లి కోసం చాలా మంది అమ్మాయిలు క్యూకడుతున్నారు. స్వయంగా ఈ విషయాన్ని ఆయన తల్లి వెల్లడించారు. ఆందోళనల తర్వాత తమ కుమారుడికి వస్తున్న మ్యారేజ్ ప్రపోజల్స్ మరింత పెరిగాయని అభిజీత్ తల్లి అనితా దీప్కే తెలిపారు. తన కుమారుడు ఇంటికి వచ్చాక వివాహ విషయమై మాట్లాడి, తుది నిర్ణయం అతడికే వదిలిపెడతామని ఆమె చెప్పారు. గత రెండేళ్ల నుంచి తన కుమారుడికి పెళ్లి ప్రతిపాదనలు వస్తున్నాయి కానీ, అతడి చదువు పూర్తయి ఆర్థికంగా స్థిరపడే వరకూ చేసుకోనని చెప్పాడని అన్నారు.'మా అబ్బాయికి కొంతకాలంగా పెళ్లి సంబంధాలు వస్తూనే ఉన్నాయి. గత రెండేళ్లుగా చాలా మంది వచ్చి అడుగుతున్నారు.. కానీ, చదువు పూర్తి చేసి, ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు" అని అనిత దీప్కే పేర్కొన్నారు. నీట్ వ్యతిరేక ఆందోళనల సమయంలో టైఫాయిడ్ బారినపడినా.. అభిజీత్ దీప్కే మాత్రం ఫ్లూయిడ్స్ ఎక్కించుకుని ఉద్యమాన్ని నడిపించారు. ప్రస్తుతం టైఫాయిడ్ నుంచి అతడు కోలుకుంటున్నారు.ఇదిలా ఉండగా, ప్రభుత్వం హామీలు ఇచ్చినప్పటికీ విద్యార్థులు ఇప్పటికీ పోలీసుల వేధింపులను ఎదుర్కొంటున్నారని దీప్కే ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆరోపించారు. ఈ వేధింపులు కొనసాగితే తిరిగి మేము వీధుల్లోకి వస్తామని ఆయన హెచ్చరించారు. "విద్యార్థులపై పోలీసుల వేధింపులు కొనసాగితే, కాక్రోచ్ జనతా పార్టీ త్వరలో భారీ శాంతియుత నిరసనతో స్పందిస్తుంది.. ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం, వారిపై వేధింపులు ఆపాలి" అని దీప్కే స్పష్టం చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, ప్రతీకార చర్యలకు పాల్పడబోమని, పరీక్షా సంస్కరణలను పరిశీలిస్తామనే హామీ సహా తమ కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో శనివారంజంతర్ మంతర్ వద్ద తన 36 రోజుల ఆందోళనను సీజేపీ విరమించింది. అయితే, అరెస్ట్ చేసిన నిరసనకారులను తక్షణమే విడుదల చేయాలని, వారిపై కేసులు ఉపసంహరించి, కొత్తగా ఎటువంటి ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయబోమని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని సీజేపీ తాజాగా డిమాండ్ చేసింది. ఒకవేళ, తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయకుంటే ఉద్యమం మళ్లీ ప్రారంభిస్తామని హెచ్చరించింది.ఆందోళనకు సంబంధించిన పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సాకుగా చూపి, ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని ఇచ్చిన హామీ నుంచి తప్పించుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించి సీజేపీ.. మరో దేశవ్యాప్త నిరసన తప్పదని హెచ్చరికలు చేసింది.

"పూర్తి జవాబుదారీతనం"నిర్ధారణ అయ్యే వరకూ తమ ఆందోళనను విరమించుకోబోమని పేర్కొంది. జులై 20 నాటి నిరసన సందర్భంగా జరిగిన పోలీసుల క్రూరత్వంపై పార్లమెంటులో చర్చించాలని, కేవలం పోలీసులనే కాకుండా హోం మంత్రిని కూడా బాధ్యులుగా చేయాలని కోరింది.

# ఆదా మారిస్తే అంతే అదొగతి

## ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

కౌతాళం, మండలంలోని ఉరుకుందకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారింది. రోడ్డంతా భారీ గుంతలతో నిండిపోవడంతో పాదాచారులు పొలాలకు వెళ్లే రైతన్నలు మరియు వాహనదారులు , తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉరుకుంద శ్రీ ఈరన్న స్వామి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. రహదారి దుస్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, ఆటో, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు కూడా వేగంగా చేరుకోవడం కష్టమవుతోందని ప్రజలు చెబుతున్నారు.భక్తులు, గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# రామాయణం ట్రైలర్ లో అది మిస్

హైదరాబాద్, జూలై 30, నితిష్ తివారి దర్శకత్వంలో రణ్బీర్ కపూర్ రాముడిగా,సాయి పల్లవి సీతగా, యశ్ రావణాసురుడి గా తెరకెక్కుతున్న సినిమా 'రామాయణం'? ఈ మూవీ దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దాంతో ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ ని గత కొద్దిసేపటి క్రితం రిలీజ్ చేశారు. ఇంతకుముందు ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్ భారీ విమర్శలను ఎదుర్కొంది. దాంతో ట్రైలర్ మీద ఎక్కువగా ఫోకస్ చేసిన దర్శకుడు దానిని అద్భుతంగా తీర్చిదిద్దడనే చెప్పాలి. ఇంతకుముందు రామాయణం కాన్సెప్ట్ ను బేస్ చేసుకొని వచ్చిన సినిమాల కంటే కూడా ఈ సినిమాను నెక్స్ట్ లెవల్లో ప్రజెంట్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. ముఖ్యంగా రావణాసురుడి పాత్రను చాలా స్ట్రాంగ్ గా చూపించబోతున్నట్టుగా తెలుస్తుంది. అతడు ఎలా లంక నగరానికి రాజయ్యాడు, ఎన్ని రాజ్యాలను తన ఆధీనంలో పెట్టుకున్నాడు. తనకు ఎదురొచ్చిన వారిని ఏం చేస్తాడనే ఒక క్యూరియాసిటిని రేకెత్తిస్తూ ట్రైలర్ ను కట్ చేశారు. రావణాసురుడు ఎదిగిన తీరును కూడా మనకు ఈ సినిమాలో పెర్ఫెక్ట్ గా చూపించబోతున్నారు. అలాగే రాముడు యుద్ధవిద్యలు నేర్చుకోవడం సీతను కలుసుకునే సన్నివేశాలు సైతం గూస్ బంప్స్ ఎపిసోడ్స్ గా తీర్చిదిద్దినట్టుగా తెలుస్తుంది. సీతారాముల వివాహం ఎలా జరిగింది. వాళ్లు వనవాసానికి వచ్చిన తర్వాత జరిగిన పరిస్థితులను సైతం చాలా కండ్లకు కట్టినట్టుగా చూపించే ప్రయత్నం చేశారు. అయితే రెండు పార్టులుగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మొదటి పార్ట్ సీత ను రావణుడు ఎత్తుకెళ్లే వరకు ఉంటుంది. రెండు పార్ట్ లో రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు కలిసి తీసుకురావడానికి ఎలాంటి ప్లాన్స్ వేశారు అనేది చూపించబోతున్నట్టుగా తెలుస్తుంది. అలాగే ఈ ట్రైలర్లో విజువల్స్ అయితే టాప్ నాచ్ లో ఉన్నాయి.

ప్రతి షాప్ లో గ్రాండియర్ ని చూపించారు. ముఖ్యంగా రామాయణానికి ఇలాంటి హై వోల్టేజ్ సీన్స్ కావాలో ఇందులో వాటిని ఇందులో పర్ఫెక్ట్ గా ప్రజెంట్ చేశారు.మొత్తానికైతే రావణాసురుడిగా యశ్ బాగా సెట్ అయ్యాడు. రాముడిగా రణ్బీర్ కపూర్ సైతం తన మార్క్ ను చూపించినట్టుగా తెలుస్తుంది. ఇక సాయి పల్లవి సీతగా డీసెంట్ పెర్ఫార్మన్స్ ఇచ్చిందనేది ట్రైయర్ చూస్తేనే అర్థమవుతుంది. శూర్పణఖగా రకుల్ ప్రీతి సింగ్ సైతం తన పాత్రకి న్యాయం చేసినట్టుగా కనిపిస్తుంది.

అంత బాగానే ఉంది కానీ హనుమంతుని పాత్రను మాత్రం ట్రైలర్ లో రివిల్ చేయలేదు.ఆయన సెకండ్ పార్ట్ లో వస్తాడు. కాబట్టి అతన్ని ఫస్ట్ ట్రైలర్ లో రివిల్ చేయనట్టుగా సినిమా యూనిట్ నుంచి కొన్ని వార్తలైతే వస్తున్నాయి? నిజానికి ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరికి హనుమంతుడు కనిపించలేదనే ఒక అసంతృప్తి లో ఉన్నారు. అదొక్కటే ఈ ట్రైలర్ లో మైనస్ గా అనిపిస్తుంది.

ఎందుకంటే హనుమంతుడికి కల్ట్ ఫ్యాన్ బేస్ ఉంది కాబట్టి ఆయన్ని కూడా ట్రైలర్ లో చూపిస్తే గూస్ బంప్స్ వచ్చుండేవి?ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమా భారీ బడ్జెట్ తో తెరకెక్కుతుంది. కాబట్టి ఈ సినిమా వరల్డ్ వైడ్ గా ఎన్ని వేల కోట్ల కలెక్షన్స్ ను రాబడుతుంది. ప్రేక్షకులను ఎంతవరకు ఎంటర్ టైన్ చేయగలుగుతుంది అనేది తెలియాలంటే మాత్రం సినిమా రిలీజ్ అయ్యేంతవరకు వెయిట్ చేయాల్సిందే?

# బీజేపికి పీకే భయం

పాట్నా, జూలై 30, ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్ కు పేరు ఉంది. కష్ట సమయాలలో వ్యూహాలు రచించి వాటిని అమలు చేసే వ్యక్తిగా ఆయన అందరికీ సుపరిచితుడే. ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహకర్త ఉద్యోగాన్ని పక్కన పెట్టి.. బీహార్ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఆయనకు ఒక్క సీట్ కూడా రాలేదు. కనీసం చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లు కూడా రాలేదు. దీంతో ప్రశాంత్ కిషోర్ స్ట్రాటజీ కేవలం కొంత పరిధికి మాత్రమే పరిమితం తేలిపోయిందిప్రశాంత్ కిషోర్ ప్రస్తుతం కొన్ని రాజకీయ పార్టీలకు పనిచేస్తున్నారు. సైలెంట్ గా వర్క్ మొదలుపెట్టారు. అయితే ప్రశాంత్ కిషోర్ గురించి ఇప్పుడు మరోసారి జాతీయ మీడియాలో చర్చ మొదలైంది.. ముఖ్యంగా బీహార్ రాష్ట్రంలో అధికార భారతీయ జనతా పార్టీకి ప్రశాంత్ కిషోర్ వ్యవహార శైలి పంటి కింద రాయిలాగా మారింది.బీహార్ లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఉపయోగ జరుగుతుంది. ఈ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీకి కంచుకోట లాగా ఉంది. ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లిపోయారు. ఆయన భారతీయ జనతా పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక వచ్చింది.ఈ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పోటీ చేస్తున్నారు. ఎలాగైనా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాలని బలంగా నిర్ణయించుకున్నారు. ప్రచారాన్ని కూడా ముమ్మరంగా మొదలుపెట్టారు. ఈ నియోజకవర్గంలో నిశ్శబ్ద ఓటర్లను ప్రశాంత్ కిషోర్ నమ్ముకున్నారు. యువతను కూడా ఆకర్షిస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ గురించి పదే పదే ప్రస్తావిస్తున్నారు. ప్రజల్లో ఉన్న నిశ్శబ్దమైన ఆగ్రహాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రశాంత్ కిషోర్ గట్టి పట్టుదలతో ఉన్నారు.ఈ ఉప ఎన్నికను భారతీయ జనతా పార్టీ ఏమాత్రం సులభంగా తీసుకోవడం లేదు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ సొంత సెగ్మెంట్ కావడంతో.. బిజెపి ఇక్కడ ఎలాగైనా గెలవాలని భావిస్తుంది. పైగా ఇక్కడ నీరజ్ కుమార్ అనే యువ నాయకుడిని పోటీలో పెట్టింది. కేవలం నితిన్ మాత్రమే కాకుండా బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి.. కీలక నాయకులు రవిశంకర్ ప్రసాద్.. మనోజ్ తివారి.. పవన్ సింగ్.. చిరాగ్ పాశ్వాన్ వంటి వారంతా ఎన్నికల ప్రచారంలో ముందు వరుసలో ఉన్నారు. వీరంతా కూడా బిజెపి అభ్యర్థి కోసం గట్టిగా కృషి చేస్తున్నారు.అటు ప్రశాంత్ కిషోర్.. ఇటు నీరజ్ మధ్య భీకరమైన పోటీ ఉన్న నేపథ్యంలో బీహార్లో ప్రధాన ప్రతిపక్షం రాష్ట్రీయ జనతాదళ్ కూడా రంగంలోకి దిగింది. పటిష్టమైన వ్యూహాలను అమలు చేస్తోంది. ఇక్కడ ఆర్జెడి అభ్యర్థిగా రేఖ గుప్త పోటీలో ఉన్నారు. ఆమె ప్రజల సమస్యలను పదే పదే ప్రస్తావిస్తున్నారు. డ్రైనేజీ సమస్య.. రోడ్ల దుస్థితి.. మౌలిక వసతులు లేకపోవడం.. నిరుద్యోగం వంటి సమస్యలను పదేపదే ప్రస్తావిస్తున్నారు. రేఖ తరఫున తేజస్వి యాదవ్ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల మీద తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.ఒకవేళ ప్రశాంత్ కిషోర్ భారతీయ జనతా పార్టీ వైపు ఉండే ఓటర్లను తన వైపు తిప్పుకోగలిగితే.. తమకు ప్రయోజనం లభిస్తుందని ఆర్జెడి భావిస్తోంది. పాట్నాకు దగ్గరగా ఉండే బాంకి పూర్ నియోజకవర్గాన్ని మామూలుగా చూడకూడదు.

ఇది ప్రశాంత్ కిషోర్ రాజకీయ అస్థిత్వానికి.. బిజెపి జాతీయ అధ్యక్షుడి పరువుకి.. తేజస్వి యాదవ్ రాజకీయ భవితవ్యానికి సంబంధించింది.. అందువల్లే ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జాతీయస్థాయిని ఆకర్షిస్తోంది.

# 21 ఏళ్ల లిమిట్ పై పెరుగుతున్న మద్దతు

హైదరాబాద్, జూలై 30,ప్రజాస్వామ్య వ్యవస్థలో వయోపరిమితి అంశం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసేందుకు ప్రస్తుతమున్న కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో కొత్త సంచలనాన్ని రేపింది. ఈ అంశంపై తెలంగాణ అసెంబ్లీలో త్వరలోనే ఒక అధికారిక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఆయన స్పష్టం చేశారు. నేటి యువతలో ఆలోచనా పరిపక్వత పెరిగిందని, దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న యువత చట్టసభల్లో తమ వాయిస్‌ను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నది రేవంత్ రెడ్డి ప్రధాన వాదన.ఈ ప్రతిపాదనకు పార్టీల సరిహద్దులు దాటి మద్దతు లభించడం విశేషం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, రేవంత్ రెడ్డి ఆలోచనను బహిరంగంగా ఆహ్వానించారు. సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉన్న ప్రతి యువకుడికీ రాజ్యాంగం, సమాజంలో మార్పులు, ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే చైతన్యం ఉన్న 21 ఏళ్ల యువతకు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఇప్పటికే పలు అభివృద్ధి చెందిన దేశాలు 21 ఏళ్లకే పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్న విషయాన్ని కూడా నేతలు గుర్తుచేస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా జాతీయ రాజకీయాల్లోనూ వేడి పుట్టిస్తోంది. కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ప్రతిపాదనకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువతకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో భాగంగా, త్వరలోనే 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా దీనిపై చర్చించి ఒక ఉమ్మడి నిర్ణయానికి వచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.79 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన మనం, రాజ్యాంగపరంగా 21 ఏళ్లకు చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదనే ప్రశ్నకు ఇప్పుడు బలం చేకూరుతోంది. అయితే, కేవలం డిజిటల్ చైతన్యం సరిపోతుందా లేదా రాజకీయ పరిణతి అనుభవంతోనే వస్తుందా అనే కోణంలో రాజ్యాంగ నిపుణులు, పార్లమెంటేరియన్లు ఈ అంశాన్ని ఎంతవరకు సీరియస్‌గా తీసుకుంటారో వేచి చూడాలి. ఏది ఏమైనా, 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు వయోపరిమితిని తగ్గించాలనే ఈ డిమాండ్ రాబోయే రోజుల్లో భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# భారీగా పెరిగిన బియ్యం ధరలు



హైదరాబాద్, జూలై 30, తెలంగాణలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల మరింత ఎక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితికి ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులపై నెలకొన్న ఆందోళనలు ఒక కారణమైతే,.. ప్రైవేటు వ్యాపారులు భారీగా బియ్యాన్ని నిల్వ చేయడం మరో ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. మే నుంచి జులై మధ్య దేశవ్యాప్తంగా బియ్యం రిటైల్ ధరలు సగటున 3.33 శాతం పెరిగాయి. అదే కాలంలో తెలంగాణలో మాత్రం 4.65 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం సగటు రిటైల్ ధర కిలోకు రూ.52.67గా ఉండగా.. ఇది దేశ సగటుతో పోలిస్తే దాదాపు రూ.10 ఎక్కువ. ప్రముఖ రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ.54 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఎల్‌నినో ప్రభావంతో పంటపై ఆందోళనలు నెలకొనడంతో ధరలు పెరిగాయని చెప్పారు. రానున్న నెలల్లో పంట బాగా వస్తే ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం బాగానే ఉన్నందున సరఫరాలో పెద్ద అంతరాయం లేదన్నారు. అయినప్పటికీ ధరలు పెరగడానికి ప్రైవేటు వ్యాపారుల నిల్వలు కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొందించిన పాలసీ పత్రం ప్రకారం.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, ఎరువులు-ఇంధన వ్యయాల పెరుగుదల, ఆసియా దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో బియ్యం ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.పాలసీ పత్రంలో మూడు రకాల పరిస్థితులను ప్రస్తావించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న రోజుల్లో బియ్యం ధరలు అకస్మాత్తుగా ఎగబాకే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం హెచ్చరించింది. ప్రస్తుతానికి మార్కెట్‌లో ధాన్యపు నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తులో ఏర్పడే వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బియ్యం వ్యాపారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని తాజా పాలసీ పత్రంలో స్పష్టం చేశారు. సెంటర్ ఫౌండింగ్ డైరెక్టర్ సమరేందు మొహంతి, పీజేటీఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఆసియాలోని ప్రధాన వరి సాగు ప్రాంతాలపై ఎల్ నినో ప్రభావం పడితే, దిగుమతి చేసుకునే దేశాలు ముందుగానే నిల్వలు పెంచుకోవడానికి మొగ్గు చూపుతాయి.దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా బియ్యం ధరలు యావరేజ్‌గా 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం అంచనా వేసింది. ఉత్పత్తి స్థిరంగా ఉండి, ప్రభుత్వాలు ఎగుమతి ఆంక్షలు విధించకపోతే, ఆందోళన కొనుగోళ్లు లేకపోతే ధరలు కేవలం 10 నుంచి 20 శాతం వరకు మాత్రమే పెరుగుతాయన్నారు. మధ్యస్థ ఉత్పత్తి నష్టాలు, ఆగ్నేయాసియా దేశాలు ముందు జాగ్రత్త చర్యగా నిల్వలు పెంచుకోవడం వల్ల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ఎగిసే అవకాశం ఉందని చెప్పారు. తీవ్రమైన ఉత్పత్తి నష్టాలు, విస్తృతమైన ఎగుమతి నిషేధాలు, పానిక్ బైయింగ్ చోటు చేసుకుంటే మాత్రం గ్లోబల్ మార్కెట్‌లో బియ్యం ధరలు ఇప్పుడున్న ధరలకు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రపంచ బియ్యం మార్కెట్‌ను స్థిరీకరించడంలో భారత్ పాత్ర అత్యంత కీలమని అధ్యయనం స్పష్టం చేసింది. ఉత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆహార ధాన్యాల నిల్వల్లో భారత్ అగ్రగామిగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే, దేశీయ అవసరాలరీత్యా భారత్ మళ్లీ ఎగుమతులపై ఆంక్షలు విధిస్తే.. అది అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలను మరింత వేగవంతం చేస్తుందని హెచ్చరించారు.

ఎలాంటి సంక్షోభాలనైనా ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం, పారదర్శకమైన వాణిజ్య విధానాలు, ఎప్పటికప్పుడు సరైన మార్కెట్ సమాచారం అందుబాటులో ఉండటం చాలా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నిత్యవసర ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో ఇప్పుడు బియ్యం ధరలు కూడా పెరిగితే సామాన్యుల జీవనం కష్టతరమవుతుందని అంటున్నారు. ఇలా అయితే జీవించటం కష్టమేనని అంటున్నారు.పంట ఉత్పత్తి సాధారణంగా ఉండి, భారీ కొనుగోళ్లు జరగకపోతే ధరలు 10-20 శాతం వరకు మాత్రమే పెరగొచ్చని పేర్కొంది. అయితే ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు ఉన్న పరిస్థితిలో.. మోస్తరు దిగుబడి తగ్గుదల, నిల్వల పెరుగుదల కారణంగా ధరలు 30-50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ ఎగుమతి ఆంక్షలు, భయంతో భారీ కొనుగోళ్లు జరిగితే ప్రపంచ బియ్యం ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రానున్న ఖరీఫ్ పంట ఆశించిన స్థాయిలో వస్తే బియ్యం ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం కొనసాగడం, నిల్వలు పెరగడం వంటి అంశాలు కొనసాగితే వినియోగదారులపై ధరల భారం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తొట్టెల బుట్టలకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్, జూలై 30,బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధమైన పండుగలలో ఒకటి. ఈ పండుగలో అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతో ముఖ్యమైన ఘట్టం. అయితే, ఈ ఉత్సవాల్లో తొట్టెల సమర్పణ కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. భక్తులు తమ మొక్కులు నెరవేరాలని, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యం కోసం అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. ఈ సందర్భంగా, భక్తుల అభిరుచి మరియు మొక్కుల ప్రకారం, తొట్టెల పరిమాణం మారుతుంది. కొందరు చిన్న తొట్టెలను సమర్పిస్తుంటే, మరికొందరు భారీ, ప్రత్యేకంగా తయారు చేసిన తొట్టెలను సమర్పించడం బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ తొట్టెల తయారీకి సంబంధించిన కళ, కార్వాన్, పురానాపూల్ ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా మారింది. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయ వృత్తిని నమ్ముకుని నేటికీ అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ తొట్టెలను వెదురు, రంగురంగుల కాగితాలు, అలంకరణ సామగ్రితో చేతిపనిగా రూపొందించడం జరుగుతుంది. ప్రతి ఏడాది, భక్తుల నుంచి ఈ తొట్టెలకు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్ కారణంగా, తొట్టెల ధరలు కూడా విభిన్నంగా ఉంటాయి. సాధారణ తొట్టెల ధరలు రూ.500 నుంచి ప్రారంభమవుతుండగా, భారీ బహుళ అంతస్తుల తొట్టెల ధరలు రూ.2 లక్షల వరకు చేరుకుంటున్నాయి. ఈ ధరలు, తయారీకి ఉపయోగించే సామగ్రి, అలంకరణ మరియు పరిమాణం ఆధారంగా మారుతుంటాయి.బోనాల ఉత్సవాల్లో తొట్టెల తయారీకి సంబంధించిన ఈ కళ, కేవలం ఆర్థిక వనరులే కాకుండా, సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి, యువతను ప్రోత్సహించడం, ఈ కళను నేర్పించడం అత్యంత అవసరం. ఈ విధంగా, భవిష్యత్తులో కూడా ఈ కళను కొనసాగించడానికి వీలు కల్పించవచ్చు. బోనాల ఉత్సవాలు, తెలంగాణ సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని, ఈ ఉత్సవాల్లో తొట్టెల తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, మన సంప్రదాయాలను మరింత బలపరిచే అవకాశం ఉంది.ఈ ఉత్సవాల్లో, తొట్టెల తయారీకి సంబంధించిన కుటుంబాలు, తమ కళను ప్రదర్శించడానికి, తమ ఉత్పత్తులను విక్రయించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాయి. ఈ సమయంలో, భక్తులు తమ ఇష్టానికి అనుగుణంగా తొట్టెలను ఎంచుకుంటారు. ఈ విధంగా, బోనాల ఉత్సవాలు, కేవలం ఆధ్యాత్మిక పండుగ మాత్రమే కాకుండా, ఆర్థికంగా కూడా కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ ఉత్సవాలు, తెలంగాణలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచుతున్నాయి. ఈ ఉత్సవాల ద్వారా, మన సంప్రదాయాలను, కళలను, మరియు సంస్కృతిని పునరుద్ధరించడానికి, ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

# సిటీలో మరో 2 ఫ్లైఓవర్లు

హైదరాబాద్, జూలై 30, హైదరాబాద్ నగరవాసులకు ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించేందుకు జీహెచ్ఎంసీ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముసారాంబాగ్ బ్రిడ్జి, సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు తుది దశకు చేరుకోగా.. వచ్చే నెలలోనే ఇవి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు నెక్లెస్ రోడ్-బేగంపేట్ ఆర్వోబీ, రసూల్‌పురా ఫ్లైఓవర్ వంటి కొత్త ప్రాజెక్టులకు కూడా రంగం సిద్ధమైంది. రూ.600 కోట్లకు పైగా అంచనా వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ కీలక ప్రాజెక్టులు పూర్తయితే నగరంలో రద్దీ ప్రాంతాల ప్రయాణం మరింత సులభం కానుంది.హైదరాబాద్ నగరంలో నగరంలోని వాహనదారులకు తీపి కబురు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన కీలక ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే నగరంలోని చాలా ప్రాంతాల్లో అండర్‌పాసులు, ఫ్లైఓవర్లు, కొత్త స్కైవాక్‌లు అందుబాటులోకి రాగా.. రద్దీ ప్రాంతాల్లో రాకపోకలను సులువు చేసేలా నిర్మిస్తున్న రెండు ప్రధాన ప్రాజెక్టులు వచ్చే నెలలోనే అందుబాటులోకి రానున్నాయి. మరో రెండు కొత్త ప్రాజెక్టులు సైతం త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. ఇప్పటికే మూసారాంబాగ్ బ్రిడ్జి, సైదాబాద్ నుంచి సంతోష్‌నగర్ వైపు నిర్మించిన స్టీల్ బ్రిడ్జి పనులు చివరి దశకు చేరుకోగా, జీహెచ్ఎంసీ వీటిని ఆగస్టులోనే ప్రారంభించేందుకు వేగంగా కసరత్తు చేస్తోంది.కేవలం రూ.52 కోట్ల వ్యయంతో 6 లేన్లతో 220 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న ముసారాంబాగ్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. అంబర్‌పేట్ ? మలక్‌పేట్ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అలాగే, చంచల్‌గూడ ప్రింటింగ్ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ వరకు రూ.620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న భారీ స్టీల్ బ్రిడ్జి కోసం పాతబస్తీ ప్రజలు ఆరేండ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి ర్యాంపులు, సైడ్ వాల్స్, విద్యుద్దీకరణ వంటి ఫినిషింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 3.32 కిలోమీటర్ల పొడవు, 85 పిల్లర్లతో రూపుదిద్దుకున్న ఈ స్టీల్ బ్రిడ్జి పూర్తయితే.. సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, ఐఎస్ సదన్, చంపాపేట్ ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరనున్నాయి.నగరంలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ కొత్తగా మరో రెండు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. రూ.152 కోట్ల వ్యయంతో నెక్లెస్ రోడ్ సంజీవయ్య పార్కు నుంచి బేగంపేట్ వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించగా.. దీనికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ ఆర్వోబీ అందుబాటులోకి వస్తే ట్యాంక్ బండ్ మీదుగా బేగంపేట్ వైపు వెళ్లేవారి ప్రయాణం మరింత సులభం కానుంది. అంతేకాకుండా రసూల్‌పురాలో రూ.48.14 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లేన్ల బయో డైవర్షనల్ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా ఇప్పటికే పూర్తయిందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నిర్మించిన ముసారాంబాగ్ ఫ్లైఓవర్‌తో పాటు సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిలతో పాటు కొత్త ఫ్లైఓవర్, ఆర్వోబీలు అందుటాటులోకి వస్తే వాహనదారుల ట్రాఫిక్ చిక్కులు తీరిపోనున్నాయి.

# తెరపైకి ఎండ్రిన్ పార్టీ

హైదరాబాద్, జూలై 30, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ నిరుద్యోగ యువతను తట్టిలేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి, రాజకీయ హామీల ఉల్లంఘనకు నిరసనగా తెలంగాణ నిరుద్యోగ జేఏసీ, పోలీస్ జేఏసీ నేతలు ఏకమై 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' పేరుతో కొత్త రాజకీయ వేదికను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యల సమగ్ర పరిష్కారమే అజెండాగా రూపుదిద్దుకున్న ఈ నిర్ణయం, ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.ఈ సంచలనాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన కారణమని నిరుద్యోగ నాయకులు స్పష్టం చేశారు. "మీరు ఒర్లినా, పొర్లుదండాలు పెట్టినా.. ఎండ్రిన్ తాగి బావిలో దూకినా పోలీస్ ఉద్యోగాలు పెంచడం సాధ్యం కాదు" అంటూ సీఎం చేసిన కామెంట్స్ నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చాయి. దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న యువత ఆవేదనను ఎద్దేవా చేసేలా ఉన్న ఈ వ్యాఖ్యలకు నిరసనగానే, ఆ పదాలనే ప్రత్యర్థులపై వ్యంగ్యాస్త్రంగా మలచి 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ'కి పురుడుపోశారు. ప్రజాస్వామ్యయుతంగా తమ గొంతును చట్టసభలు, రాజకీయ వేదికలపై వినిపించడమే ఈ నూతన వేదిక లక్ష్యమని ప్రతినిధులు వెల్లడించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను కూడా పెట్టారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిర్దేశిత గడువులోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన యువత కోసం 20 వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను నింపాలన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్ -3, గ్రూప్-4 నియామక ప్రక్రియను ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేకుండా పారదర్శకంగా వేగవంతం చేయాని డిమాండ్ చేశారు.పార్టీ నమోదు ప్రక్రియను వారం రోజుల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ వద్ద పూర్తి చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేటలో భారీ ఆవిర్భావ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విప్లవ పోరాటాల ప్రతీక మారోజు వీరన్న స్థూపం వద్ద తెలంగాణ ఎండ్రిన్ పార్టీ అధికారిక లోగోను ఆవిష్కరించి తొలి బహిరంగ సభ ద్వారా తమ బలాన్ని చాటుకోనున్నారు.ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించాల్సిన రాజకీయం మరొకటి ఉంది. జాతీయ స్థాయిలో వెలిసిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా పూర్తి మద్దతు పలికారు. యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టేలా వయోపరిమితిని సడలించాలని కాంగ్రెస్ గళమెత్తి సర్వత్రా ప్రశంసలు అందుకుంది. కానీ, సొంత రాష్ట్రంలో గత 50 రోజులుగా నిరుద్యోగులు రోడ్డెక్కి పోరాడుతున్నా, వారి సమస్యలను పట్టించుకోకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య హక్కులు మాట్లాడే కాంగ్రెస్, స్థానికంగా నిరుద్యోగుల ఆవేదనను తృణీకరించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శిస్తున్నారుకాక్రోచ్ జనతా పార్టీ బాటలోనే 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' ఆవిర్భవించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఊహించని పెద్ద రాజకీయ తలనొప్పిగా మారింది. నిరుద్యోగుల తిరుగుబాటు కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఎన్నికల క్షేత్రంలో ఓటు బ్యాంకును శాసించే స్థాయికి చేరితే అది అధికార కాంగ్రెస్‌కు సవాలుగా మారడం ఖాయం. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం మొండివైఖరి వీడి నిరుద్యోగుల సమగ్ర డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో ఈ 'ఎండ్రిన్' ఉద్యమ సెగలు రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్ధృతం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

# మెట్రోపై అప్ డేట్...

హైదరాబాద్, జూలై 30, హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టు కేంద్ర కేబినెట్ అనుమతుల కోసం సిద్ధమవుతుండగా.. రెండు నెలల్లోగా తొలిదశ స్వాధీన ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎఫీఈఅ రుణం నిలిచిపోవడంతో, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ వంటి ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ సంస్థల ద్వారా రూ.13,527 కోట్ల రుణ సమీకరణకు హెచ్ఎంఆర్ కసరత్తు చేపట్టింది. నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయడంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది.

కాగా, కొత్తగా రాష్ట్ర ప్రభుత్వ పలు మార్గాల్లో మెట్రోను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ అనుమతుల ప్రక్రియ వేగవంతమైంది.

రానున్న రెండు నెలల్లో ఈ అంశాన్ని కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకురానున్నట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి స్పష్టం చేసింది. అయితే, అప్పటిలోగా మెట్రో తొలిదశ స్వాధీన ప్రక్రియను పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ఢిల్లీలో గత వారం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ ఎండీ సమావేశమయ్యారు. తొలిదశ స్వాధీనంలో జాప్యం, రెండోదశ అనుమతుల్లో ఆలస్యం వల్ల ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను రాష్ట్ర అధికారులు ఈ భేటీలో వివరించారు.

తొలిదశతో రెండోదశను ముడిపెట్టవద్దని కోరినప్పటికీ, రెండు దశల అనుసంధానానికి స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలిపారు.తొలిదశ స్వాధీన ప్రక్రియ మే నెలాఖరు నాటికే ముగియాల్సి ఉన్నప్పటికీ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందవలసిన రూ.13,527 కోట్ల రుణ మంజూరు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. కేంద్రం నుంచి ఎన్వోసీ రాకపోవడంతో ఈ నిధులు విడుదల కాలేదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటనలు, కేంద్ర మంత్రులతో చర్చల అనంతరం తొలిదశ విలువ నిర్ధారణకు, నూతన రుణాల సేకరణకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించాలని నిర్ణయించారు. అయితే, ఆ తర్వాత నెలన్నర రోజులుగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో అధికారులు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే నూతన రుణ సమీకరణ కీలకం కానుంది. ఎఫీఈఅ తప్పుకున్నట్లు కేంద్రం సంకేతాలు ఇవ్వడంతో జైకా తరహాలోనే 3.5 శాతం వడ్డీ రేటుకు కొత్తగా ాఃఎ, ఎఅఎఅఎ వంటి ప్రముఖ బ్యాంకింగ్ సంస్థల ద్వారా రుణం సమకూర్చుకునే మార్గాలపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కసరత్తు ప్రారంభించింది. రుణమిచ్చే సంస్థల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఏజెన్సీని నియమించే ఆలోచనలో ఉంది.

గతంలో ఎఫీఈఅతో ఒప్పందానికి ఆరు నెలలకు పైగా సమయం పట్టగా.. ఇప్పుడు కేవలం రెండు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయడం క్లిష్టతరమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదే అంశంపై హైదరాబాద్‌లో మంగళవారం జరగాల్సిన కీలక బోర్డు సమావేశం వివిధ కారణాలతో వాయిదా పడింది.కాగా, ప్రస్తుతం ఎల్బీనగర్- మియాపూర్, నాగోల్-రాయదుర్గం, ఎంజీబీఎస్- పరేడ్ గ్రౌండ్స్ మధ్య మూడు మార్గాల్లో మెట్రో పరుగులు పెడుతుండగా.. కొత్తగా ఎంజీబీఎస్-చంద్రాయన్ గుట్ట, శంషాబాద్, ఎల్బీనగర్-హయత్ నగర్, సికింద్రాబాద్-మేడ్చల్ వరకు మెట్రో ప్రతిపాదనలు ఉన్నాయి.

# లోక్‌సభలో ప్రతిపక్ష నాయకత్వ హోదాకే అవమానంగా రాహుల్ ప్రసంగం

**లోకల్ సభలో ఏం మాట్లాడాలో, లోక్ సభలో ఏం మాట్లాడాలో తెలియని రాహుల్ గాంధీ**

**తెలంగాణ యువత బలిదానాలకు, విద్యార్థుల రోదనకు కాంగ్రెస్ పాపమే కారణం**

**విదేశీ విహారాల రహస్యాలను, పౌరసత్వ వివాదాన్ని దేశ ప్రజలకు వెంటనే విప్పి చెప్పాలి**

**ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శలు**



హైదరాబాద్ జులై 30;“లోకల్ సభలో ఏం మాట్లాడాలో, అత్యున్నతమైన లోక్ సభలో ఏం మాట్లాడాలో కనీస అవగాహన, జ్ఞానం కూడా లేనటువంటి వ్యక్తి ఈ దేశానికి ప్రతిపక్ష నాయకుడా అని భారతీయులంతా ముక్కు మీద వేలేసుకుని తలదించుకునేలా రాహుల్ గాంధ?యవహరించారని బిజెపి సీనియర్ నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే శ్ ఎన్.వి.ఎస్. ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ పల్నాటి వెంకట్ రెడ్డి గారితో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సభా గౌరవాన్ని మంటగలిపేలా రాహుల్ గాంధీ నిన్న లోక్‌సభలో మాట్లాడిన పదాలు, అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు ఆయన అపరిపక్వతకు నిదర్శనమని ప్రభాకర్ గారు మండిపడ్డారు. గతంలో పార్లమెంట్‌లో కనుసైగలు చేయడం, ఫ్లయింగ్ కిస్‌లు ఇవ్వడం, చిలిపి చేష్టలు చేయడం రాహుల్‌కు అలవాటుగా మారిందని, ఆయన మానసిక స్థితి సరిగ్గా లేకే “సభను ఆర్డర్‌లో పెట్టు” అంటూ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన ప్రసంగంలో పాయింట్ లేకపోగా, దేశ ప్రజలను తీవ్రంగా డిసపాయింట్ చేశారని విమర్శించారు.

గతంలో కోర్టుకు లిఖితపూర్వకంగా క్షమాపణలు చెప్పి ఒక కేసులో బయటపడిన రాహుల్ గాంధీ, మరో పరువు నష్టం కేసులో సీటును కూడా కోల్పోయి, స్టేపై తాత్కాలికంగా కొనసాగుతున్నారని గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ ఆర్థిక కుంభకోణంలో తల్లి, కొడుకు ఇద్దరూ బెయిల్‌పై బయట తిరుగుతూ నీతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బెయిల్ రద్దయితే రాహుల్ గాంధీ పోవాల్సింది జైలుకేనని స్పష్టం చేశారు. యువతకు ప్రతీక అని చెప్పుకునే రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో కాంగ్రెస్ చేసిన జాప్యం వల్ల 1,200 మంది అమాయక విద్యార్థులు, యువకులు ఆత్మబలిదానాలు చేసుకోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఎన్నికల్లో జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను మోసగించిన నెంబర్ వన్ దగాకోరు రాహుల్ గాంధీ అని నిలదీశారు. కర్ణాటకలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, గతంలో కాంగ్రెస్ హయాంలో సీబీఎస్ఈ, జేఈఈ, ఎయిమ్స్ పేపర్ల లీకేజీలతో కాంగ్రెస్ నాయకులు ‘లీక్ వీరులు’గా మిగిలిపోయారని విమర్శించారు.

రాహుల్ గాంధీ పౌరసత్వంపై బ్రిటన్ సిటిజన్‌షిప్ వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని, దేశ సమగ్రత, సైన్యం ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా విదేశీ గడ్డపై చిల్లర మాటలు మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. అసలు దేశంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ విదేశాలకు ఎందుకు పారిపోతారని ప్రశ్నించారు. ఇప్పటివరకు 207 సార్లు ఒకే విదేశీ ప్రాంతానికి వెళ్లి, అక్కడి మహిళలతో, పిల్లలతో విహారయాత్రలు, నౌకాయానాలు చేయడం వెనుక రహస్యమేంటో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంలో ఇలాంటి పనులు చేసేవారిని ‘ఇడియట్’ అంటారని, ప్రధాని మరియు హోంమంత్రి పట్ల దురుసుగా ప్రవర్తించిన రాహుల్ గాంధీకి రాజకీయాల్లో కొనసాగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.

# భారీగా పెరుగుతున్న సైబర్ నేరాలు...

## (అప్రమత్తతే అసలైన ఆయుధం)

## -- హెచ్. ప్రతాప్

సాంకేతిక విప్లవం మన జీవితాలను సులభతరం చేసినంత వేగంగా నేరాల రూపురేఖలనూ మార్చేసింది. ఒకప్పుడు దొంగ ఇంటి గుమ్మం దాటాల్సి వచ్చేది. ఇప్పుడు కేవలం ఒక ఫోన్ కాల్, ఒక సందేశం, ఒక నకిలీ లింక్ చాలు... క్షణాల్లో జీవితకాల పొదుపు మాయమవుతోంది. సైబర్ నేరాలు ఇప్పుడు దేశ అంతర్గత భద్రత, ఆర్థిక వ్యవస్థ, సామాజిక విశ్వాసానికి అతిపెద్ద సవాలుగా మారాయి.

జాతీయ నేర గణాంకాలు, కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో సైబర్ మోసాల ఫిర్యాదులు నమోదవుతున్నాయి. డిజిటల్ చెల్లింపుల విస్తరణతో పాటు మోసాలూ విపరీతంగా పెరుగుతున్నాయి. పెట్టుబడి మోసాలు, “డిజిటల్ అరెస్టు” పేరుతో బెదిరింపులు, యూపీఐ మోసాలు, నకిలీ ఉద్యోగాలు, రుణ యాప్‌లు, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన నకిలీ వీడియోలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌కు 2025 ఫిబ్రవరి నాటికే కోట్ల రూపాయల నష్టాలకు సంబంధించిన లక్షలాది ఫిర్యాదులు చేరాయి.

తెలంగాణ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. 2024లో 18,230 సైబర్ నేరాల కేసులతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. కర్ణాటక రెండో స్థానంలో నిలవగా, తెలంగాణలో ప్రతి లక్ష జనాభాకు నమోదైన సైబర్ నేరాల రేటు కూడా దేశంలోనే అత్యధికంగా నమోదైంది. 2025లో దేశవ్యాప్తంగా నమోదైన సైబర్ నేరాల ఎఫ్ఐఆర్‌లలో దాదాపు 24శాతం తెలంగాణలోనే నమోదయ్యాయి. ఇది రాష్ట్రంలో అవగాహన, ఫిర్యాదుల నమోదు మెరుగుపడిందనే సంకేతమే కాకుండా, మోసాల తీవ్రత కూడా పెరుగుతోందని స్పష్టం చేస్తోంది.

సైబర్ నేరాల పెరుగుదలకు ప్రధాన కారణాలు ప్రజల్లో అవగాహన లోపం, వ్యక్తిగత సమాచారాన్ని నిర్లక్ష్యంగా పంచుకోవడం, బలహీన సంకేతపదాలు ఉపయోగించడం, అపరిచిత లింకులను నమ్మడం, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే ఆశ. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారుతున్నారు.

ఈ సవాలును ఎదుర్కోవాలంటే ప్రభుత్వం, బ్యాంకులు, సాంకేతిక సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. పాఠశాల స్థాయి నుంచే సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలి. అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింకులను వెంటనే తిరస్కరించాలి. మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930 లేదా జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. డిజిటల్ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత అవసరమో, అప్రమత్తత అంతకంటే అవసరం. “ఆలోచించు... నిర్ధారించు... ఆ తర్వాతే స్పందించు” అనే ఒక్క అలవాటు లక్షల రూపాయలతో పాటు జీవితకాల నమ్మకాన్నీ కాపాడగలదు.

# గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం

ప్రారంభించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌రాజన్న సిరిసిల్ల వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో రూ. 12 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా నటరాజ విగ్రహం, సప్త మాతృకల విగ్రహాలు, గార్డెన్, మొక్కలు, భారీ శివుడి విగ్రహాన్ని వారు పరిశీలించారు

# పవిత్రతకు ప్రాధాన్యం!

## విగ్రహాల సేకరణ కు శ్రీకారం

## ముందుకొచ్చిన సనాతన ట్రస్ట్



హైదరాబాద్ జులై 30; రాష్ట్రవ్యాప్తంగా పాత దేవతా విగ్రహాల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇళ్లలో, దేవాలయాల్లో కాలక్రమేణా శిథిలావస్థకు చేరి పూజకు అనువుగా లేని దేవతా విగ్రహాలను చెత్తలో వేయకుండా గౌరవప్రదంగా సేకరించి శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు ముందుకు వస్తున్నాయి.ఇందులో భాగంగా నాగోల్ ఆనంద్ నగర్ కేంద్రంగా ఉన్న సనాతన సేవా ట్రస్ట్ ఆగస్టు మొదటి వారంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఆనంద్ నగర్ ఇంద్రప్రస్థ కాలనీ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ఇందుకు వేదిక కానుంది. చెట్ల దగ్గర, చెరువులలో పాత దేవతా చిత్రాలను పడేయకుండా సనాతన ట్రస్ట్ కు అందించాలని ట్రస్ట్ చైర్మన్ సునీల్ శనగల ట్రస్టీలు నవీన్ శనగల, ఎల్లా పంతులు చంద్రశేఖర్, కలాం శెట్టి హరిబాబు, మానస శనగల లు కోరారు. అందించిన వారి గోత్ర నామాలతో పండితుల ఆధ్వర్యంలో ఉద్వాసన పూజ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందుకు 9014019752 నెంబర్ కు వాట్సప్ చేయాలనీ ఆయన సూచించారు పూర్తి వివరాలు హిందూ వాయిస్ ఇన్, యూ ట్యూబ్ ఛానల్ .లో చూడాలని వారు కోరారు తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి కూడా విశేష స్పందన లభిస్తోందని తెలిపారు.హిందూ సంప్రదాయాల ప్రకారం దేవతా విగ్రహాలకు ప్రత్యేక పవిత్రత ఉందని, అవి పాడైనప్పటికీ సాధారణ వస్తువుల మాదిరిగా పారవేయడం సరికాదని వారు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులు తమ ఇళ్లలో ఉన్న పాత విగ్రహాలను స్వచ్ఛందంగా అప్పగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సేకరించిన విగ్రహాలను ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం నదులు, చెరువులు లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పవిత్ర కుండాల్లో నిమజ్జనం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. దాంతో ధార్మిక సంప్రదాయాలు పరిరక్షించబడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ తోడ్పాటు అందుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యమవుతున్నాయి. పాత విగ్రహాలను చెత్తకుప్పల్లో, రోడ్ల పక్కన లేదా నీటి వనరుల్లో నిర్లక్ష్యంగా పడేయకుండా సంబంధిత సేకరణ కేంద్రాలకు అప్పగించాలని భక్తులకు పిలుపునిస్తున్నారు.

పవిత్రతను కాపాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భక్తుల్లో అవగాహన పెరగడం వల్ల పాత దేవతా విగ్రహాల పరిరక్షణకు ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

పాత విగ్రహాలను చెత్తలో వేయొద్దని శాస్త్రోక్తంగా అప్పగించండని ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు విజ్ఞప్తి.చేస్తున్నాయి.

# దేవాలయ కమిటీలకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్ ,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,ఎం.సునీతారావ్



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు--2026 సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలోని దేవాలయ కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే రాజాసింగ్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి పంపిణీ చేసిన ఏఐసీసీ సభ్యురాలు గోష్యామహల్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ ఎం.సునీతారావ్ ,మెట్టు సాయికూమార్ ,శ్రీకాంత్ యాదవ్ , నర్మదాసింగ్ ,ఎస్.ధన్‌రాజ్ ,కనకయ్యయాదవ్ ఈసందర్భంగా సునీతారావ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది.



గోషామహల్ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.



# నిజాంపేట్ నుండి యాదగిరిగుట్ట,భద్రాచలం మరియు వేములవాడ బస్సులు ఏర్పాటు చేయండి

## మెదక్ పార్లమెంట్ సభ్యులు , మెదక్ శాసన సభ్యులు, మెదక్‌డిపో మేనేజర్ ని కోరిన నిజాంపేట్ మండల ప్రజలు

**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి:**తెలంగాణా రాష్ట్రంలో మెదక్ జిల్లా రామాయంపేట్ ,నిజాంపేట్,భూంపల్లి మండలాల మీదుగా యాదగిరిగుట్ట బస్సును నడిపేవారు .ప్రస్తుతం నడపడం లేదు .మూడు మండలాలలో




40 గ్రామాలు ఉన్నాయి. యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్ళే రామాయంపేట్ ,నిజాంపేట్,భూంపల్లి మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.అదే విధంగా తెలంగాణా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తెలంగాణాలో ప్రముఖ దేవస్థానాలైన యాదగిరిగుట్ట మరియు వేముల వాడ ,భద్రాచలం లకు మెదక్ డిపో నుండి రామయంపేట్ మీదుగా నిజాంపేట్ మండలం మీదుగా భూంపల్లి ,సిద్దిపేట మీదుగా డైరెక్ట్ బస్సులు వేయగలరు .ఈమూడు పుణ్యక్షేత్రాలకు నిజాంపేట మండలం మీదుగా మెదక్ నుండి డైరెక్ట్ బస్సులను వేసి నిజాంపేట్ మండల ప్రజల మరియు భక్తుల ఇబ్బందులను తీర్చగలరు. ఈ అంశం పై తక్షణయే స్పందించి బస్సులను వేయగలరని మెదక్ డిపో మేనేజర్‌ను నిజాంపేట్ మండల ప్రజలు కోరుచున్నారు.తెలంగాణా ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.అందులో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసినారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహాస్వామి మందిరంకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం వలే దేవాలయ కమీటీని నియమించినారు.ఈ రెండు దేవాలయాలకు భారతదేశంతో పాటు తెలంగాణా రాష్ట్రంనుంచి మారుమూల గ్రామాల నుండి భక్తులు వచ్చేలా తెలంగాణా ఆర్టీసీ బస్సుసౌకార్యాలు ఏర్పాటు చేయడం ఏంతైనా అవసరం ఉన్నది.మెదక్‌జిల్లా లోని శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి మందిరానికి రైలు సౌకర్యం ఏర్పాటు చేసిన విధంగా స్థానిక మెదక్ నియోజక వర్గం ఎమ్మెల్యే మెదక్ నియోజకవర్గం పార్లమెంట్ సభ్యులు మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం నుండి యాదగిరిగుట్ట , వేములవాడ ,భద్రాచలం కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయుటకు నిజాంపేట్ మండల ప్రజలు కోరుచున్నారు. నిరంతరం రద్దీగా ఉండే నిజాంపేట్ మండల ప్రాంతం ఈ బస్సుల సౌకర్యం కల్పిస్తే మరింత గా అభివృద్ధి చెందుతుంది. అంతేకాకుండా ఈ బస్సుల రాకతో నిజాంపేట్ మండల ప్రజలతో పాటు తెలంగాణా ఆర్టీసీ కి కూడా లాభాలు చేకురుతాయి.అందువల్ల త్వరితగతిన ఈ ప్రాంతంనకు యాదగిరిగుట్ట మరియు వేములవాడల,భద్రాచలంలకు డైరెక్ట్ బస్సు సౌకర్యం కలిగించగలరని నిజాంపేట్ మండల ప్రజలు కోరుచున్నారు.

# బీసీ గురుకుల హాస్టల్ డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

## గుడ్ల నిల్వ లేకపోవడంపై ఆరా.. పోషకాహారంలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 30:తితుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర వసతి గృహం)ను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో నర్సింగ్ అధికారి నిర్వహిస్తున్న ఆరోగ్య రికార్డులు, మందుల నిల్వ, వంటశాల నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, వంటకు ఉపయోగిస్తున్న కూరగాయల నాణ్యత, నిల్వ విధానం, పరిశు భ్రత ప్రమాణాలను పరిశీలించారు.



తనిఖీలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన గుడ్ల నిల్వ పూర్తిగా లేకపోవడాన్ని గుర్తించిన డా. ఆనంద్, వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన పోషకాహారం ఎలాంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు తాజా, పోషక విలువలు కలిగిన ఆహారం అందించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. హాస్టల్ సామర్థ్యం 783 మంది కాగా ప్రస్తుతం 679 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నట్లు పరిశీలనలో వెల్లడైంది. ఆహార నాణ్యత, వంటశాల పరిశుభ్రత, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నిల్వ, హాస్టల్ పరిసరాల పరిశుభ్రతను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న ఆయన, అవసరమైతే ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలతో హాస్టల్‌లోనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, లేదంటే సమీప తుర్కపల్లి లేదా శామీర్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు.

# ఏపీలో బుద్ధిస్ట్ సర్క్యూట్...

విజయవాడ, జూలై 30 ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను అనుసంధానిస్తూ త్వరలోనే 'బుద్ధిస్ట్ సర్క్యూట్'ను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. ఉత్తర భారతదేశంలో ఉన్న తరహాలోనే ఏపీలో కూడా బుద్ధిస్ట్ సర్క్యూట్ ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, బుద్ధగయ తరహాలో రాష్ట్రంలోనే తొలిసారిగా కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన 'మైత్రేయ బుద్ధవిహార్'ను ఆయన ప్రారంభించారు. ఈ బుద్ధవిహార్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించేలా, దీనిని ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు.రాష్ట్రంలోని ఆదుర్రు, బావికొండ, తొట్లకొండ, అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఉండ్రాజవరం వంటి బౌద్ధ క్షేత్రాలను కలుపుతూ ఈ సర్క్యూట్‌ను రూపొందిస్తామని మంత్రి దుర్గేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించగా, ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలంక నాగానంద ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు బోదగమా ఛాందిమా తెరో బౌద్ధ పతాకాన్ని ఎగురవేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు...

## జిల్లా యంత్రాంగం అప్రమత్తం,కంట్రోల్ రూమ్ నెంబర్ 08455-276155

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 30(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది,జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు,ప్రజల నుండి అందే అత్యవసర ఫిర్యాదులు, సమాచారం, నష్టం వివరాలను వెంటనే స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు,ప్రజలు భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారి అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సమస్యలు లేదా ఇతర ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని 08455-276155 నంబర్‌కు వెంటనే తెలియజేయాలని తెలిపారు,కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించదానికి సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత తహసీల్దార్‌కు వెంటనే పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు,జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు,ప్రజలు అవసరం లేనప్పుడు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదని, అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.



# చరిత్ర సృష్టించనున్న రాజీవ్ పార్క్...

## నలుగురు ముఖ్యమంత్రుల సహకారంతో సంగారెడ్డి రాజీవ్ పార్క్ అభివృద్ధి మరో రూ. 6 కోట్ల రూపాయల నిధులతో సుందరీకరణ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 30(ప్రజాబలం)** ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ జరగని అద్భుతం సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది, అనాడు 2004లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజీవ్ పార్క్ ను మంజూరు చేస్తే ,సీఎం రోశయ్య శంకుస్థాపన చేశారు,కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంబించారు,తిరిగి మరలా సుందరీకరణ తర్వాత త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాజీవ్ పార్క్ పునః ప్రారంభం అయ్యి చరిత్ర సృష్టించనుంది,సంగారెడ్డి రాజీవ్ పార్క్ ఏర్పాటు, అభివృద్ధిలో నలుగురు ముఖ్యమంత్రుల సహకారం ఉందని జగ్గారెడ్డి అన్నారు,గురువారం ఆయన రాజీవ్ పార్క్ ను సందర్శించి పార్క్ లో జరుగుతున్న అభివృద్ధి





పనులను పర్యవేక్షించారు,పార్క్ మొత్తం కలియ తిరుగుతూ జరుగుతున్న,జరగాల్సిన అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు,పార్క్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను స్వయంగా పరిశీలించారు,ఫౌంటెన్ పునరుద్దన పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు,ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ పార్క్ కు అనుమతులు మంజూరు చేశారన్నారు,అనంతరం సీఎం రోశయ్య శంకుస్థాపన చేయగా,సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించారన్నారు,పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో రాజీవ్ పార్క్ పూర్తిగా చెడిపోయి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందని అన్నారు,తిరిగి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టీకే శ్రీదేవి సహకారంతో మరో రూ. 3 కోట్ల నిధులతో రాజీవ్ పార్క్ ను మొదటి దశగా అభివృద్ధి చేశామని,మరో రూ. 6 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు,త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాజీవ్ పార్క్ ను తిరిగి ప్రారంభిస్తమని వివరించారు,ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిశన్ నాయకులు బొంగుల రవి,కూన సంతోష్,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్,టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్,శ్రీహరి,కౌన్సిలర్ లు మహేష్,నవాజ్ ,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# లోకల్ ఎన్నికలపై విజయ్ బ్యాక్ స్టెప్

చెన్నై, జూలై 30 తమిళనాడు రాజకీయ వేదికపై విప్లవాత్మక మార్పులతో అధికారాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్, ప్రతిపక్షాలకు చిక్కని కొత్త వ్యూహానికి తెరలేపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరలోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారంలోకి వచ్చాయి. పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇప్పుడే ఎన్నికలకు వెళ్తే పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే అంచనాలతో ఎన్నికలను కనీసం ఒక ఏడాది పాటు వాయిదా వేయాలని సీఎం విజయ్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది.ఈ వ్యూహాత్మక వెనుకంజ వెనుక ఉన్న అసలు కారణం.. టీవీకేకి క్షేత్రస్థాయిలో ఉన్న బలహీనమైన సంస్థాగత నిర్మాణమే . అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్టార్ పవర్, యువత ఓట్లు , కొత్త మార్పును కోరుకున్న ఓటర్ల మద్దతుతో టీవీకే ఘనవిజయం సాధించినప్పటికీ, గ్రామ స్థాయిలో క్రియాశీలక నాయకత్వం, బూత్ స్థాయి నెట్‌వర్క్ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం అధినేత ఇమేజ్, రాష్ట్రస్థాయి అంశాలు సరిపోతాయి కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా క్షేత్రస్థాయి వ్యక్తిగత పరిచయాలు, బలమైన కార్యకర్తల జాలంపైనే ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో స్థానిక పోరుకు వెళ్తే గ్రామీణ స్థాయిలో ఉన్న క్యాడర్ లోపం బయటపడే అవకాశం ఉంది.మరోవైపు, పరాజయం పాలైనప్పటికీ ఇప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గ్రామీణ స్థాయిలో బలమైన స్థానిక బూత్ కమిటీలు కలిగిన ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే, తమకున్న కేడర్ బలంతో డీఎంకే క్షేత్రస్థాయిలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# వయోవృద్ధులు నీరు త్రాగేటప్పుడు జాగ్రత్త -సాయి చౌదరి



వికారాబాద్ జులై 30;: సీనియర్ సిటిజన్ నీళ్లు తాగుతూ ఊపిరితిత్తులలోకి నీరు పోయి (గొంతుకు అడ్డం పడి) ఊపిరి ఆడక ఆసుపత్రిలో చేరే ప్రమాదం ఉందని, వయసు పైబడిన వారు జీవితంలో ఏ పని చేసినా, ముఖ్యంగా ఈ రెండు విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి సొసైటీ పేర్కొన్నారు. 1.పడకుండా జాగ్రత్తపడటం (Prevent Falling), 2 గొంతుకు అడ్డం పడకుండా (దండుపోకుండా) చూసుకోవడం (Prevent Choking),. నీళ్లు తాగేటప్పుడు మిగతా పనులన్నీ పక్కన పెట్టి, పూర్తి శ్రద్ధతో నీటిని నెమ్మదిగా, జాగ్రత్తగా తాగాలి. వృద్ధులలో గొంతు మరియు మింగడానికి సహాయపడే కండరాలు బలహీనపడటం వల్ల ఇలా గొంతుకు అడ్డం పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నీరు, పాలు, సూప్ వంటి ద్రవపదార్థాలు గొంతుకు అడ్డం పడటం వల్ల వృద్ధులలో 'ఆస్పిరేషన్ న్యుమోనియా' (Aspiration Pneumonia) వచ్చే అవకాశం చాలా ఎక్కువ వీలైనంత వరకు నీళ్లు తాగడానికి స్ట్రా ఉపయోగించండి. అలాగే నీటిని మింగేటప్పుడు తల కొద్దిగా దించి (క్రిందికి వంచి) మింగాలి, పల్చటి సూప్ల కంటే చిక్కటి (Thick) సూప్ల ఇవ్వడం మంచిది. పల్చటి ద్రవాలు నోట్లోకి వేగంగా ప్రవహిస్తాయి, దీనివల్ల శ్వాస తీసుకోవడంలో స్వల్ప తేడా వచ్చినా వెంటనే గొంతుకు అడ్డం పడతాయి. నోట్లో ఘనపదార్థం (అన్నం లేదా టిఫిన్) నములుతున్నప్పుడు లేదా నోట్లో ఆహారం ఉన్నప్పుడు ద్రవపదార్థాలు తాగకూడదు... అలాగే అటు ఇటు తల తిప్పకూడదు. యువకులకు ఉన్నంత శారీరక శక్తి, తట్టుకునే సామర్థ్యం వృద్ధులకు ఉండవు. ఒకవేళ ఏదైనా ద్రవం లేదా ఆహారం శ్వాసనాళంలోకి వెళ్లి, దాన్ని బయటకు దగ్గడానికి ప్రయత్నించినప్పుడు ముఖం ఎర్రగా మారిపోతుంది మరియు రక్తపోటు (Blood Pressure) అకస్మాత్తుగా పెరుగుతుంది. కొన్నిసార్లు ఈ ఊపిరి ఆడకపోవడం ప్రాణాంతకం కావచ్చు.వయసు పెరుగుతున్న కొద్దీ నీటిని నెమ్మదిగా, శ్రద్ధగా మరియు జాగ్రత్తగా తాగడం అలవాటు చేసుకోవాలి అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తెలిపారు.

# రెడ్ అలర్ట్ నేపథ్యంలో 16, 17వ వార్డుల్లో కలెక్టర్ పర్యటన -- సమస్యలకు శాశ్వత వర్డ్ ప్రజల కష్టాలకు పరిష్కారం ఎప్పుడు?



**జగిత్యాల జిల్లా: జూలై 30 (ప్రజా బలం ప్రతినిధి ):**జిల్లాలో రానున్న 48 గంటల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రకటించిన రెడ్ అలర్ట్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం జగిత్యాల పట్టణంలోని 16, 17వ వార్డుల పరిధిలోని సలీమా గార్డెన్ ప్రాంతంలో పర్యటించి వర్షపు నీటి ప్రవాహ మార్గాలు, కల్వర్ట పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.రెడ్ అలర్ట్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు వచ్చే 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని, గ్రామ సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు తదితర ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామాల వాణి, 16వ వార్డు కౌన్సిలర్ దుమ్మాల రాజ్‌కుమార్, 17వ వార్డు కౌన్సిలర్ కమల్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, అర్బన్ తహసీల్దార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.అయితే అధికారులు పర్యటించి పరిస్థితులను పరిశీలించినప్పటికీ ఏళ్లుగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల సమస్యలకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.16, 17వ వార్డుల్లో వర్షపు నీటి పారుదల కోసం అత్యంత అవసరమైన నాలా నిర్మాణ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటంతో ప్రతి వర్షాకాలంలో కాలనీల్లోని రహదారులు జలమయం అవుతున్నాయని, పలుచోట్ల ఇళ్లలోకి కూడా వర్షపు నీరు చేరుతోందని ప్రజలు చెబుతున్నారు. చిన్నపాటి వర్షానికే కాల్వలు పొంగిపొర్లి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.లక్షల రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మౌలిక వసతుల లేమితో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని, సరైన నాలా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆస్తుల విలువ కూడా తగ్గిపోతోందని పేర్కొంటున్నారు. నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు.భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా అధికారులు పర్యటనలు నిర్వహించడం, పరిస్థితులను సమీక్షించడం మాత్రమే కాకుండా, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పెండింగ్‌లో ఉన్న నాలా నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని 16, 17వ వార్డుల ప్రజలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో జోరు వానలు- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు! చూడముచ్చటగా

**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి** అదిలాబాద్, జూలై 30 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుంటొస్తున్న జోరు వానలు అన్నదాతల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న జనం ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే మరో 4 రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల లో-లెవెల్ వంతెనల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. రహదారులు జలమయం అవ్వడంతో మరోవైపు చెట్లు నేలకొరిగి, ఇళ్లు కూలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అప్రమత్తమై ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో లింగాపూర్, సిర్పూర్ (యు) మండలాల్లోని పలుచోట్ల లో-లెవెల్ వంతెనలపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది.

వంతెనలపై నీటి ఉద్ధృతి పెరగడంతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.గుండి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో డప్పు చాటింపు నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకల వద్దకు వెళ్లొద్దని, చేపల వేటకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపానికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల దృష్ట్యా జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు.ఆసిఫాబాద్ లోని తుంపెల్లి వాగు, గుండి వాగులు పరిశీలించి, పోలీస్ సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. వరద తగ్గిన తర్వాతనే ప్రజలు దాటేందుకు అనుమతి ఇవ్వాలని వరద అధికంగా ఉన్న సమయంలో రాకపోకలు నిలిపి వేయాలని ఆదేశించారు.

భద్రత చర్యలకు సంబంధించిన సామాగ్రి అందుబా టులో ఉంచుకోవాలని సూచించారు.రానున్న నాలుగు రోజులపాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ముఖ్యంగా వాగులు, వంకలు, చెరువులు, నదులు, కల్వర్టులు, లో-లెవెల్ బ్రిడ్జిల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రయాణాలు చేయవద్దని, పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం వరద ప్రభావిత ప్రాంతాలు, లో-లెవల్ బ్రిడ్జిల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్?100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.సెల్ఫీలు, రీల్స్ లేదా ఇతర వినోదాల కోసం వరద ప్రాంతాలు, వాగులు, చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దు.ఆసిఫాబాద్ జిల్లాలో వాగుల వద్ద వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ కె. హరిత పరిశీలించారు. ఆసిఫాబాద్ మండలంలోని తుంపెల్లి వాగు వద్ద వరద ప్రవాహ పరిస్థితిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో రాబోయే 3 రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలన్నారు. ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. వంతెనలపై నుంచి వరద నీరు పారే అవకాశం ఉన్నందున, వాహనదారులను, కాలినడకన వచ్చేవారిని వంతెన దాటకుండా నివారిస్తున్నారు. టూవీలర్స్, పశువుల కాపరులు పొంగిపొర్లుతున్న వాగులు/వంకల అవతలి వైపునకు వెళ్లకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. ?వర్షాలు, వరదల వల్ల ఎదురయ్యే అత్యవసర సహాయం, సమాచారం కోసం కలెక్టరేట్‌లో 8500844365 నెంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

మంచిర్యాల జిల్లాలో భారీ వర్షానికి కూలిన ఇళ్లు

మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కోటపల్లి మండలం ఆలుగామ గ్రామంలో ఉదయాన్నే ఇల్లు ఒక్కసారిగా కూలిపోవడంతో గృహిణి తీవ్రంగా గాయపడగా, ఆమె భర్త, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రస్తుతం బాధితు రాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మంచిర్యాల జిల్లాలో మంగళవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని ఆలుగామ గ్రామానికి చెందిన ఆత్రం మాంతు కుటుంబం ఇంట్లో నిద్రిస్తుండగా, బుధవారం తెల్లవారున ఆకస్మికంగా వారి ఇల్లు కూలిపోయింది. ఈ ప్రమాదంలో గృహిణి ఆత్రం లక్ష్మి శిథిలాల కింద చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. భర్త మాంతు, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి శిథిలాలను తొలగించి క్షతగాత్రులను బయటకు తీసి 108 అంబులెన్స్ ద్వారా చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఆత్రం లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో పాత ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు గుండాల వాటర్‌ఫాల్ వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా మారింది. జలపాతం నుంచి దూసుకొస్తున్న నీటి ధాటికి చుట్టుపక్కల ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు పర్యాటకులను జలపాతం వద్దకు అనుమతించడం లేదు. ఇంతకుముందు ఇక్కడ ప్రమాదాలు జరిగినందున ప్రజలు, యువకులు సెల్ఫీలు, వీడియోల పేరుతో జలపాతం వద్దకు వెళ్లవద్దని స్థానిక అధికారులు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు తగ్గే వరకూ ఆసిఫాబాద్ జిల్లాలో పర్యాటకులకు నిషేధం విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కుంటాల జలపాతానికి భారీ వరద

ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు కుంటాల జలపాతం వద్ద భారీగా వరద నీరు ప్రవహిస్తోంది.

పరవళ్ళు తొక్కుతూ అందాల నడుమ వరద ప్రవాహం కనిపిస్తోంది. గత వారం రోజుల క్రితం కుంటాల జలపాతం వద్ద కొంతమేర ప్రవాహం ఉన్నప్పటికీ ప్రస్తుతం రెండు రోజుల ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షానికి మరింత ప్రవాహం ఎక్కువైంది. దీంతో జలపాతం వద్ద భారీగా వరద ఉధృతి ప్రవహిస్తూ కనిపిస్తోంది. ఈ జలపాతం అందాలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు.

అయితే జలపాతం వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అవతలి వైపే ఉండేలా అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

భారీ వరద ఉధృతి ఉన్నందున పర్యాటకులు, వరద ఉధృతి వద్ద స్నానాల కోసం కానీ, సెల్ఫీల కోసం గానీ లోపలి వైపు వెళ్లరాదని, అవతలి వైపు బయటే ఉండి వీక్షించాలని సూచిస్తున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష: నారా లోకేశ్

విజయవాడ, జూలై 30 ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు?2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్.. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సమగ్ర సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా పేర్కొన్నారు

# ఓటు హక్కును నిర్లక్ష్యపరచకుండా సవరణకు సహకరించండీ



**గండిపేట ప్రజా బలం ప్రతి నిధి 30 జులై 2026**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతికి లోబడి చట్టబద్ధతగా ఓటు హక్కు డిజిటలైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు. అట్టి ప్రక్రియ ఆగస్టు 3 తో ముగియ నుండగా మణికొండ, నెక్నంపుర్ డివిజన్ ప్రజానీకం స్పందించి, ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కను వజ్రాయుధంగా పరిగణనలోకి తీసుకుని, ఓటు హక్కు కోల్పోవద్దనే సదుద్దేశంతో కొంత మంది తమ తమ ఓటును డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా సద్వినియోగ పరుచు కోవడానికి గురువారం రోజున ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు పంచవటి కాలనీ గ్రంథాలయంకి, మరి కొంత మంది స్థానికులు ఉదయం 11 నుండి 2 మరియు సాయంత్రం 4 నుండి 7 వరకు





షిర్డీ సాయి నగర్ శ్రీ చైతన్య కాలనీకి విచ్చేయడం ద్వారా ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంలో వారికి భారత రాష్ట్ర సమితి స్థానిక నేతలు అందే లక్ష్మణ్ రావు, సుమనళిని, సంగం శ్రీకాంత్, జయరాం, తిరుపతి తదితరులు ఓటు వివరాలను తెలుపుతూ, 2002 లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల ఓటు వివరాలను తెలుసుకొని ఎన్యూమరెశన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారాన్ని అందచేయడం జరిగినది.

## మర్పల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి భారీ నుండి అతి భారీ వర్షాలు మండల ప్రెసిడెంట్ తుమ్మల సురేష్ యాదవ్



**వికారాబాద్ ప్రతినిధి జూలై 30(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల ప్రజలువర్షాకాలం వచ్చింది భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి కాబట్టిచిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు

జాగ్రత్తలు

1. పాత ఇళ్ళు, కూలే స్థితిలో ఉన్న గోడల దగ్గరికివెళ్లవద్దు
2. కరెంట్ స్తంభాలు, తీగలు తడిసి ఉంటే ముట్టుకోవద్దు
3. లోతట్టు ప్రాంతాల్లోనీరు నిల్వ ఉంటే బయటికి వెళ్లవద్దు
4. జ్వరం, దోమల బారి నుండి కాపాడుకోవడానికి శుభ్రత పాటించండి
5. వాహనాలు నడుపుతున్నప్పుడు స్పీడ్ తగ్గించి జాగ్రత్తగా నడపండి
6. గోరువెచ్చని నీళ్లు తాగండిఅందరూ సురక్షితంగా ఉందాం

వర్షాకాల హెచ్చరిక

7.వర్షంలో బయటికి వెళ్లేటప్పుడు జాగ్రత్త!
8.పిల్లల్ని ఒంటరిగా వదలకండి
9.జ్వరం వస్తే వెంటనే డాక్టర్ ని సంప్రదించండి
10.జాగ్రత్తగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం కాబట్టి ప్రతి ఒక్కరు వర్షాకాలం పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు

## సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం.. 21 అంశాలకు ఆమోదం నలుగురు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 30:** సత్తుపల్లి పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ రిహానా బేగం అధ్యక్షతన నిర్వహించారు.

సమావేశంలో మొత్తం 21 అంశాలను ప్రవేశపెట్టగా, సభ్యులు వాటన్నింటినీ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మున్సిపాలిటీకి నలుగురు కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కలిగిన వారిగా డాక్టర్ కందిమళ్ల కృష్ణారావు, వేములపల్లి పుష్పలతలను, అల్పసంఖ్యాక వర్గం నుంచి మహమ్మద్ ఫయాజ్ అలీ, బేతంపూడి దేవమణిలను కో-ఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేశారు.

సమావేశంలో వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహా, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ సురేష్, టీపీఓ కె. రాజు, టీపీఎస్ ఐ. భాస్కర్, టీపీబీఓ కిరణ్, ఆర్ఐ కె. దిలీప్ కుమార్, సీనియర్ అకౌంటెంట్ వై. సుజాత, జూనియర్ అకౌంటెంట్ షేక్ జరీనా, మెప్మా కోఆర్డినేటర్ ఆర్.వి. ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ పోస్టుల నియామకాల్లో అక్రమాలపై విచారణ జరిపించాలి

## మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 30 ప్రజాబలం:**ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.ను గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఇటీవల జిల్లాలో నిర్వహించిన ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, బాధిత అభ్యర్థులతో కలిసి వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. ఈ నియామకాలలో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. మొత్తం నియామక ప్రక్రియపై సమగ్ర







విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకే ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. బాధిత అభ్యర్థులకు ధైర్యం చెప్తూ.. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే ఈ అక్రమాలపై హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని సండ్ర వెంకట వీరయ్య భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, నాయకులు బిచ్చాల తిరుమలరావు, బత్తుల మురళి, మరియు తదితర నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి - డీఎస్పీ సైదా



**జహీరాబాద్, జూలై 30 ప్రజా బలం ప్రతినిధి:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్కల్, ఝరాసంగం మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ డీఎస్పీ సైదా సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువలు, బ్రిడ్జిలపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అత్యవసరం లేకపోతే ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న పాత భవనాల సమీపంలో ఉండరాదని పేర్కొన్నారు.

చెరువులు, కుంటలు, వాగులు ఉప్పొంగుతున్న సమయంలో వాటిని చూసేందుకు వెళ్లకూడదని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 100, 112 నంబర్లతో పాటు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712656739ను సంప్రదించాలని తెలిపారు. అలాగే సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల ఫోన్ నంబర్లను కూడా ప్రజల కోసం అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ సైదా విజ్ఞప్తి చేశారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

## టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

హైదరాబాద్, జూలై 30 తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి.ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి.ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది.ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భద్రతా పక్షోత్సవంలో సత్తుపల్లి ఏరియాకు రెండు పురస్కారాలు



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 30:** సింగరేణి సంస్థ వ్యాప్తంగా నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం--2025 పోటీల్లో సత్తుపల్లి ఏరియాకు చెందిన రెండు విభాగాలు ప్రతిభ చాటాయి.

జేవీఆర్ సీహెచ్‌పీ విభాగం కంపెనీ స్థాయిలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, ఇటీవల రామగుండం--1 ఏరియాలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం జేవీఆర్ సీహెచ్‌పీలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖరరావు, ఎస్‌సీ (ఈఅండ్ఎం) పి. సాయినాథ్, డిప్యూటీ ఎస్‌సీ (ఈఅండ్ఎం) బి. రాంబాబు, సేఫ్టీ ఆఫీసర్ ఎ. ప్రదీప్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ కె. శ్రీనివాస్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి డి. ప్రసాద్, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి ఇ. నాగేష్తో పాటు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

అదే భద్రతా పక్షోత్సవంలో కిష్టారం ఓసీ ప్రాజెక్టు గ్రూప్--3 ఓపెన్‌కాస్ట్ గనుల విభాగంలో ఓవరాల్ పనితీరుకు ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసి విజయాన్ని జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో గని మేనేజర్ బి. రామకృష్ణ, అదనపు మేనేజర్ వల్లమల్ల బాబు, సేఫ్టీ ఆఫీసర్ గోపి కిశోర్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి కిశోర్ కుమార్, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి షణ్ముఖ చారితో పాటు అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద... ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు

హైదరాబాద్, జూలై 30 తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పాటు జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాలు, నదీ తీర ప్రాంతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వివిధ జలాశయాల ప్రస్తుత పరిస్థితి వివరాలు:

జూరాల ప్రాజెక్టు (మహబూబ్‌నగర్):

ఇన్‌ఫ్లో: 91,000 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 81,695 క్యూసెక్కులు (10 గేట్లు ఎత్తివేత).

నీటిమట్టం: గరిష్ఠంగా 318.516 మీటర్లకు గాను ప్రస్తుతం 317.35 మీటర్లకు చేరింది.

నీటి నిల్వ: పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.371 టీఎంసీలు నమోదైంది. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి:

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 27.4 అడుగులకు చేరడంతో తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):

ఇన్‌ఫ్లో: 6,250 క్యూసెక్కులు.

నీటిమట్టం: పూర్తిస్థాయి 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1065 అడుగులు ఉనంది. 80 టీఎంసీల సామర్థ్యానికి గాను 16 టీఎంసీల నిల్వ ఉంది.

నిజాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):

ఇన్‌ఫ్లో: 3,935 క్యూసెక్కులు.

నీటిమట్టం: పూర్తిస్థాయి 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1395.83 అడుగులకు చేరింది. 17.802 టీఎంసీల సామర్థ్యానికి గాను 7.146 టీఎంసీల నీరు నిల్వ ఉంది (గత ఏడాది ఇదే సమయానికి 4.622 టీఎంసీలుగా ఉంది).

సింగూరు ప్రాజెక్టు (సంగారెడ్డి):

ఇన్‌ఫ్లో: 517 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 470 క్యూసెక్కులు.

నీటి నిల్వ: 29.9 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 4.249 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది.

# మహాలక్ష్మితో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంత్రి పొన్నం ప్రభాకర్

### వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు మంత్రులు, ప్రభుత్వ విప్ శంకుస్థాపన

### కోరుట్ల మీదుగా బాసరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం






**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:** మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పక్కాగా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపడుతున్నామని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రోజుకు 50 వేల మంది వేములవాడ బస్ స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి రూ. 11,668 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. 2600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 కోట్లతో బస్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగుల దాదాపు రూ.1000 కోట్ల పీఎఫ్ బకాయిలు, 600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించామని వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఈ ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గతంలో పలుమార్లు కూలిపోయిన బస్‌స్టేషన్ సమీప వంతెనను భూ నిర్వాసితులకు న్యాయం చేసి పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు నేడు (శుక్రవారం) స్థానిక సెలవు

## అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దు జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జూలై 30, 2026 -- ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు, పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు జూలై 31 (శుక్రవారం) స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ సెలవుకు బదులుగా ఆగస్టు 8 (రెండో శనివారం) జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సాధారణంగా పనిచేస్తాయని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని కోరారు.

జిల్లాలో ప్రస్తుతం భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. వాగులు, చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జిలు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లకుండా ఉండాలని, ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తల్లిదండ్రులు తమ పిల్లలను వరద ప్రభావిత ప్రాంతాలు, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్షాలు, వరదల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా లేదా సహాయం అవసరమైనా ప్రజలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1939కు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు.

అత్యవసర సమయాల్లో ఎక్కడైనా అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే అగ్నిమాపక శాఖను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సహాయం కోసం 8712699212 నంబర్‌కు కాల్ చేసి ఫైర్ డిపార్ట్‌మెంట్ సేవలను పొందవచ్చని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలందరూ జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, విపత్తు నిర్వహణ బృందాలు, సంబంధిత అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలి

## విగ్రహ తయారీదారులతో నగర సీపీ సజ్జనర్ సమన్వయ సమీక్షా సమావేశం






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం ముందస్తు సన్నద్ధతను వేగవంతం చేసింది. ఇప్పటికే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో భేటీ అయిన ఉన్నతాధికారులు.. తాజాగా విగ్రహ తయారీదారులతో సమన్వయ సమీక్ష నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మాట్లాడుతూ... విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. గత ఏడాది నగర కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల విగ్రహాలను ప్రతిష్ఠించారని, అయితే రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేసిన ఆయన, ఈసారి అటువంటి పొరపాట్లకు తావులేకుండా తయారీ దశ నుంచే పక్కా భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో చర్చించిన మేరకు విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులకే పరిమితం చేయాలన్నారు.

కళాకారులు సామాజిక బాధ్యతతో మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనమయ్యే చిన్న విగ్రహాల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విగ్రహాల తయారీ వర్క్‌షాప్‌లలో ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ చర్యలు చేపడుతూ, విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని, ఆవరణలను ప్రమాదకర రసాయనాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తయారీదారులకు అవసరమైన మౌలిక వసతులను వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో కల్పించేలా సిటీ పోలీస్ విభాగం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్ నియంత్రణ, సురక్షిత రవాణాపై దిశానిర్దేశం చేస్తూ ధూల్‌పేట్, జల్ పల్లి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రధాన కేంద్రాల నుంచి విగ్రహాలను నగరంలోకి సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను పూర్తిగా నివారించాలని, స్థానిక ట్రాఫిక్ పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చి క్లియరెన్స్ పొందాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రవాణా ఏర్పాట్లను ముందస్తుగా పర్యవేక్షించేందుకు వీలుగా విగ్రహాల కొనుగోలుకు సంబంధించి తయారీదారులు ఎప్పటికప్పుడు తమ బుకింగ్ వివరాలను స్థానిక లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

అదేవిధంగా, విగ్రహాలను ఆయా మండపాలకు తరలించే ఆగమనం సమయం, మార్గాల గురించిన ముందస్తు సమాచారాన్ని కూడా కచ్చితంగా అందించాలని స్పష్టం చేశారు. అతిపెద్ద విగ్రహాలను తరలించే సమయంలో ఓవర్ హెడ్ విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీసులతో ముందస్తు రవాణా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. విగ్రహాల లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఉపయోగించే క్రేన్లు, రవాణా వాహనాలు కచ్చితంగా సర్టిఫైడ్ అయి ఉండి, అనుభవజ్ఞులైన నిపుణుల ద్వారా మాత్రమే నిర్వహించబడాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు సీపీ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, ఐపీఎస్, ట్రాఫిక్ డిసిపిలు శ్రీమతి కాజల్ సింగ్, రాహుల్ హెగ్డే, గోల్కొండ జోన్ డిసిపి జె. రాఘవేందర్ రెడ్డి, శంషాబాద్ జోన్ డిసిపి బి. రాజేష్‌లతో పాటు పలువురు అదనపు డీసీపీలు, ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, విగ్రహ తయారీదారులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

### సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
### ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
### నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
### ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది.

నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది.

రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.

గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది.

పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి... పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది.




వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# లష్కర్ బోనాల కు రండి!

## గవర్నర్ కు దేవాదాయ శాఖ మంత్రి ఆహ్వానం



హైదరాబాద్, జులై 30 , 2026: గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ , దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ హనుమంతరావు తో కలిసి గురువారం లోక్ భవన్‌లో కలిశారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ఆషాఢ జాతర (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు హాజరుకావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. ఆహ్వాన పత్రిక ను గవర్నర్ కు మంత్రి అందజేశారు.

అంతకుముందు

'ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్" పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

మాజీ పీసీసీఎఫ్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ శ్రీ పరేష్ కుమార్ శర్మ (ఐఎఫ్ఎస్, విశ్రాంత) రచించిన 'ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్--మెమోయర్స్ ఆఫ్ ఎ ఫారెస్టర్' పుస్తకాన్ని గవర్నర్ లోక్ భవన్ లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అటవీ సంపద, జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో ఎస్ఆర్ఏఎస్ పబ్లిష్‌కు చెందిన శ్రీమతి సుప్రియా భలే రావు, డాక్టర్ మనోరంజన్ భంజా (ఐఎఫ్ఎస్, విశ్రాంత), సైకాలజీ కౌన్సిలర్ శ్రీమతి నేహా వ్యాస్ పాల్గొన్నారు.

గవర్నర్ ను కలిసిన శ్రీ శారద పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానంద మహారాజ్ లి

శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానంద మహారాజ్ గురువారం లోక్ భవన్ లో గవర్నర్‌ను కలిశారు.

విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కె.సి. రెడ్డి, మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ శ్రీ చి. అన్వేష్ తదితరులు కూడా లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

# పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

హైద్రాబాద్, జూలై 30 తెలుగు రాష్ట్రాల్లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించింది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, జగిత్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే సమయంలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేస్తూ, అక్కడ భారీ వర్షాలు నమోదవుతాయని వెల్లడించింది. ఇక హైదరాబాద్ మహానగరంలోనూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసే అవకాశాలు ఉన్నందున, నగరవాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ంఖూఆఓం) వెల్లడించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయి. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com